E KABURU - Digital News Paper
E-PAPER
ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
హైదరాబాద్ (తేదీ) 15-05-2026 (వారం) శుక్రవారం సంపుటి: 02 || సంచిక:132|| పేజీలు–6
www.ekaburu.com

హార్మూజ్‌ను దాటిన 2 భారతీయ నౌకలు

03

సీఎం రేవంత్ కాన్వాయ్ వాహనాల కుదింపు!

03

మోదీ సర్కారు వైఫల్యంతోనే నీట్ రద్దు

లీకేజీల్లో బీజేపీ, బీఆర్ఎస్ మధ్య పోలికలు

విద్యార్థుల భవిష్యత్తుకు విలువ లేకుండా చేశారు

కేంద్ర ప్రభుత్వంపై సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు

ఈ-కబురు, హైదరాబాద్: నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ.. మోదీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ప్రశ్నపత్రాల లీకేజీ కారణంగా పరీక్ష రద్దు కావడంతో యువత భవిత వ్యంపై ప్రభావం పడుతోందని తెలిపారు. పోటీపరీక్షల ప్రశ్నపత్రాల లీకులతో విద్యార్థుల భవిష్యత్తుకు విలువ లేకుండా చేశారని అన్నారు. ప్రశ్న పత్రాల లీకేజీలు, వైఫల్యాలు, విద్యార్థులకు ద్రోహం, వ్యవస్థీకృత అవినీతిలో బీజేపీ, బీఆర్ఎస్ మధ్య పోలికలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటిదాకా కేంద్ర స్థాయిలో నిర్వహించే పలు పరీక్షల పత్రాలు లీకైనా సంబంధిత ఏ ఒక్క కేంద్ర మంత్రీ ఎందుకు రాజీనామా చేయలేదని.. వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

మిగతా 2లో

జూన్ 25 నుంచి 'సర్'

- తెలంగాణ అవతరించాక మొదటిసారి నిర్వహణ షెడ్యూల్ విడుదల
- 83 లక్షల ఇళ్లకు వెళ్లి సర్వే చేయనున్న బీఎల్‌వోలు
- ఈ నెల 12 నాటికి ఉన్న ఓటర్లు 3,39,20,705 మంది
- జులై 31న ముసాయిదా ఓటర్ల జాబితా
- తుది ప్రచురణ అక్టోబరు 1న

ఈ-కబురు, దిల్లీ, హైదరాబాద్:

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) మూడో దశ నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. సంబంధిత షెడ్యూల్‌ను గురువారం ప్రకటించింది. ప్రస్తుతం జనగణనలో భాగంగా దేశవ్యాప్తంగా గృహగణన నిర్వహిస్తున్న యంత్రాంగాన్ని దృష్టిలో ఉంచుకొని అదే కార్యక్రమంతోపాటు సర్ మూడో దశ షెడ్యూల్‌ను ఖరారు చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో బూత్ లెవెల్ అధికారులు (బీఎల్‌వో) జూన్ 15 నుంచి జులై 14 తేదీల మధ్యలో ఇంటింటికీ తిరిగి పరిశీలన చేస్తారు. తెలంగాణలో ఈ కార్యక్రమం జూన్ 25 నుంచి జులై 24వ తేదీల మధ్యలో ఉంటుంది. హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌లు మినహాయించి దేశంలోని మిగిలిన అన్ని రాష్ట్రాల్లో సర్ మూడో దశ కార్యక్రమం కొనసాగుతుంది. ''ఇది ఓటర్లు, రాజకీయ పార్టీలు, ఎన్నికల అధికారులందరి భాగస్వామంతో నిర్వహించే కార్యక్రమం. అందువల్ల అన్ని రాజకీయ పార్టీలూ ప్రతి పోలింగ్ బూత్‌కూ బూత్‌స్థాయి ఏజెంట్లను నియమించాలి. పార్టీలు పూర్తిస్థాయిలో భాగస్వామ్యమైతే ఈ కార్యక్రమం పూర్తి పారదర్శకతతో నిర్వహించడానికి వీలవుతుంది'' అని ఎన్నికల సంఘం పేర్కొంది.

మిగతా 2లో

రాయలసీమ ఇకపై రక్షణ సీమ

సీమకు భారీగా డిఫెన్స్ ప్రాజెక్టులు

రూ.15,803 వేల కోట్లతో ఏ ఎమ్ సీ ఏ ప్రాజెక్టుకు పుట్టపర్తిలో శంకుస్థాపన

డిఫెన్స్, డ్రోన్ రంగాల్లో మరో 12 ప్రాజెక్టులకూ భూమి పూజ

రక్షణ మంత్రితో భూమి పూజ చేయనున్న సీఎం చంద్రబాబు

02

ఈ-కబురు,,అమరావతి, మే 14: రాయల సీమ రతనాల సీమ... ఇది చరిత్ర. ఉద్యాన సీమ... ఇది వర్తమానం. రక్షణ సీమ... ఇది భవిష్యత్. ఇరిగేషన్, హార్టికల్చర్, స్పేస్, డ్రోన్, సోలార్, విండ్ ఎనర్జీ వంటి రంగాల్లో దూసుకెళ్తున్న రాయలసీమ డెవలప్మెంట్ జర్నీలో మరో కీలక రంగం జత కానుంది.



తైవాన్ విషయంలో తప్పు చేస్తే ఘర్షణ తప్పదు

అమెరికా అధ్యక్షుడికి చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ స్పష్టీకరణ

తైవాన్‌కు సైనిక సహకారం అందివ్వొద్దని సున్నిత హెచ్చరిక

రెండు గంటలపాటు చర్చలు జరిపిన ఇద్దరు నేతలు

02

కేరళం సీఎంగా ఎంపికైన వీడీ సతీశన్‌కు సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు

02

వ్యాసాశ్రమంలో పరంపర పతనమా..?

మహర్షి మలయాళస్వామి ఆశయాలకు విరుద్ధంగా జరుగుతున్న వ్యవహారాలపై భక్తుల ఆవేదన

02



ఫార్ములా ఈ రేస్ కేసులో కేటీఆర్‌కు నోటీసులు

03

కేటీఆర్ తో ఆస్ట్రేలియా హైకమిషనర్

ఫిలిప్ గ్రీన్ భేటీ

02

ఈ-కబురు, హైదరాబాద్ : భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో భారతదేశంలోని ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ హిల్లరీ మెక్‌గీచీ తో గురువారం సమావేశమయ్యారు. నందినగర్ లో జరిగిన ఈ భేటీలో పరస్పర ప్రయోజనాలు మరియు వ్యూహాత్మక అంశాలపై విస్తృతంగా చర్చించడమైనది.ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఆస్ట్రేలియా పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, సాంకేతిక రంగంలో పరస్పర సహకారం, మరియు విద్యారంగంలో నూతన భాగస్వామ్యాల గురించి ఈ సమావేశంలో ప్రస్తావించారు. గతంలో పరిశ్రమలు ఐటీ శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవమున్న కేటీఆర్ ఈ అంశంలో అనేక అంశాలపై చర్చించారు.

మరోసారి లాయరైన మమత

03

సతీశన్ ఆచరణాత్మక

రాజకీయవేత్త

కేరళ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ప్రకటన

అధిష్టానం నిర్ణయం పట్ల తీవ్ర అసంతృప్తిలో రమేశ్ చెన్నితాల!

ఐయూఎంఎల్ ఒత్తిడితోనే సతీశన్ ఎంపిక

క్షేత్రస్థాయిలో అండగా నిలిచిన నేతలు, కార్యకర్తలు

03

మోదీతో రష్యా మంత్రి లావ్రోవ్ భేటీ

03

పంజాబ్ పై ముంబై ఘన విజయం

మెరిసిన తిలక్, రికెల్టన్

ప్లేఆఫ్స్ అవకాశాలు సంక్లిష్టం

ఐపీఎల్‌లో ప్లేఆఫ్స్ రేసుకు దూరమైన జట్లు స్వేచ్ఛగా ఆడుతూ, ముందంజ వేసే అవకాశమున్న జట్లను దెబ్బ తీయడం ఎప్పుడూ జరిగేదే. గురువారం ముంబయి ఇండియన్స్ కూడా అదే పని చేసింది

06

ఈ-కబురు

15- 05 - 2026
శుక్రవారం
E-kaburu.com

కేరళం సీఎంగా ఎంపికైన వీడీ సతీశన్‌కు సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు

ఈకబురు, ,హైదరాబాద్ ;
కేరళం ముఖ్యమంత్రిగా ఎంపికైన వీడీ సతీశన్‌కు తెలంగాణ సీఎం ఎ. రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. కేరళం ప్రజలకు దశాబ్దాలుగా సేవ చేస్తూ... విలువలతో కూడిన రాజకీయాలు చేసే సతీశన్‌కు ఈ పదవి రావడం సముచిత గుర్తింపు అని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధికి మద్దతుగా విస్తృతంగా ప్రచారం చేసిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్‌కు అధికార బాధ్యతలు అప్పగించారని అన్నారు.విద్య, వైద్యం, అక్షరాస్యతలో కేరళం దేశానికి ఆదర్శంగా నిలిచిందని రేవంత్ రెడ్డి తెలిపారు. సతీశన్ నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి, పర్యాటకం, పరస్పర సహకారం వంటి రంగాల్లో కేరళం ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. కేరళం మరింత ప్రగతి, సుసంపన్నత దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నట్టు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

తైవాన్ విషయంలో తప్పు చేస్తే ఘర్షణ తప్పదు

ఈకబురు, ,మే 14: తైవాన్‌కు అమెరికా సైనిక సహకారం అందించటంపై గుర్రుగా ఉన్న చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్.. అగ్రరాజ్యాధినేతకు నేరుగా హెచ్చరికలు జారీచేశారు. తైవాన్ విషయంలో ఏమాత్రం తప్పుడు నిర్ణయాలు తీసుకున్నా ఘర్షణ తప్పదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ముఖంమీదే తేల్చిచెప్పేశారు. రెండురోజుల చైనా పర్యటనలో ఉన్న ట్రంప్.. గురువారం షీ జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. బీజింగ్‌లోని గ్రేట్ హాల్ ఆఫ్ పీపుల్‌లో రెండు గంటలపాటు ఏకాంతంగా జరిగిన చర్చల్లో తైవాన్ వివాదంతోపాటు పశ్చిమాసియా యుద్ధం, హోర్ముజ్ జలసంధి మూసివేతతో ప్రపంచవ్యాప్తంగా తలెత్తిన సంక్షోభం, అమెరికాచైనాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం తదితర అంశాలపై చర్చలు జరిపారు. చర్చల వివరాలను అధికారికంగా వెల్లడించనప్పటికీ.. చైనా అధికారిక మీడియా సంస్థ జిన్‌హువా పలు వివరాలు బయటపెట్టింది. తైవాన్ విషయంలో ట్రంప్‌కు జిన్‌పింగ్ తన వైఖరిని స్పష్టంగా చెప్పారని పేర్కొంది. 'తైవాన్ విషయంలో అమెరికా సరైన పద్ధతిలో వ్యవహరిస్తే.. మన రెండు దేశాల మధ్య సంబంధాలు ఉన్నతంగా స్థిరంగా కొనసాగుతాయి' అని జిన్‌పింగ్ తెలిపినట్లు జిన్‌హువా వెల్లడించింది. వాణిజ్య యుద్ధం వల్ల ఎవరికీ ప్రయోజనం కలగదని, నష్టమే మిగులుతుందని ట్రంప్‌తో జిన్‌పింగ్ అన్నారు. 'వాణిజ్యం విషయంలో ప్రత్యర్థుల్లా కాకుండా మిత్రులుగా ఉందాం. పరస్పర సహకారంతో పనిచేద్దాం' అని జిన్‌పింగ్ సూచించినట్లు పేర్కొంది. మరోవైపు చైనాతో తమకు ఉన్న వాణిజ్య లోటును పూడ్చటమే ముఖ్యమైన అంశమని ట్రంప్ స్పష్టంచేసినట్లు అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ ఒక ప్రకటనలో తెలిపింది. చైనాకు సమీపంలో దక్షిణ చైనా సముద్రంలో ఉన్న తైవాన్ తనదేనని చైనా ఎప్పటినుంచో వాదిస్తోంది. ఆ ద్వీపంతో ఏ దేశమూ నేరుగా సంబంధాలు పెట్టుకోవద్దని హెచ్చరిస్తూ వస్తోంది. తైవాన్ మాత్రం తాము సర్వస్వతంత్రులమని చెప్పుకుంటోంది. తైవాన్‌తో అనధికారి సంబంధాలు కొనసాగి స్తున్న అమెరికా.. ఆ దేశానికి ఆయుధాలు, ఇతర సాంకేతికతలను అంది స్తోంది. కాగా, జిన్‌పింగ్ హెచ్చరికల నేపథ్యంలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో కీలక వ్యాఖ్యలు చేశారు. తైవాన్ విషయంలో అమెరికా విధా నంలో ఏమార్పూ ఉండదని స్పష్టంచేశారు. చైనాతో తైవాన్ స్వచ్ఛందంగా కలిసిపోయేందుకు ముందుకొస్తే తమకు అభ్యంతరం లేదని, బలవంతంగా ఆ ద్వీపాన్ని స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నిస్తే మాత్రం చైనా పెద్ద తప్పు చేసినట్లే అవుతుందని హెచ్చరించారు.

హోర్ముజ్‌ను తెరిచి ఉంచాల్సిందే..
హోర్ముజ్ జలసంధిని స్వేచ్ఛాయుత నౌకారవాణా కోసం తెరిచి ఉంచాల్సిందేనని ట్రంప్, జిప్‌పింగ్ నొక్కి చెప్పారు. ఈ జలసంధిపై ఎవరి నియంత్రణ ఉండరాదని ఇద్దరు నేతలు అంగీకారానికి వచ్చినట్లు వైట్‌హౌస్ పేర్కొంది. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండరాదన్న అమెరికా వాదనకు జిన్‌పింగ్ సంపూర్ణ మద్దతు ఇచ్చినట్లు తెలిపింది.

మోదీ సర్కారు వైఫల్యంతోనే నీట్ రద్దు

'నీట్ రద్దు.. దేశప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిన పెద్దనోట్ల రద్దు వంటిదే. లీకేజీలతో విద్యార్థులకు భవిష్యత్తు లేకుండా చేస్తున్నారు. దేశయువత భవిష్యత్తు ప్రశ్నార్థకమైంది. వ్యవస్థీకృతంగా మారిన ప్రశ్నపత్రాల లీకేజీలు, ప్రభుత్వ వైఫల్యాలు దేశ యువతను తీవ్ర అనిశ్చితి, నిరాశలోకి నెట్టాయి. ఎంతో ఒత్తిడి మధ్య ఏళ్ల తరబడి కష్టపడి చదువుకున్న విద్యార్థుల కలలు మోదీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం కల్లలు అయ్యాయి. ఎంతో మంది విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి, కొంతమంది నగలు అమ్మి పిల్లలను నీట్‌కు సిద్ధం చేశారు. ఇప్పుడు వారి ఆశలన్నీ గల్లంతు కావడం బాధాకరం. 2019 నుంచి 15 రాష్ట్రాల్లో ప్రధాన నియామక పరీక్షల పత్రాలు లీక్ అయ్యాయి. బీజేపీ పాలిత రాష్ట్రాలే ఈ లీకేజీలకు ప్రధాన కేంద్రాలుగా మారాయి.

గుజరాత్‌లోనే 14 లీకేజీ ఘటనలు..
మోదీ అధికారంలోకి వచ్చాక 11 ఏళ్లలో ప్రభుత్వ పరీక్షల వ్యవస్థలో వ్యవస్థీకృత నేరాలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన 'ది పేపర్ లీక్ డికేడ్' శ్వేతపత్రం ప్రకారం.. కేంద్ర, రాష్ట్ర పరీక్షల్లో ఇప్పటిదాకా 93 పేపర్ లీక్ ఘటనలు జరిగాయి. వీటితో దాదాపు 2 కోట్ల మంది విద్యార్థులు ప్రభావితమయ్యారు. 2024లో కేవలం ఎనిమిది వారాల్లోనే నాలుగు ప్రధాన జాతీయ పరీక్షలు.. నీట్ యూజీ, యూజీసీనెట్, సీఎస్ఐఆర్‌నెట్, నీట్ పీజీ రద్దు అయ్యాయి. 2024లో యూపీ పోలీసు కానిస్టేబుల్ పరీక్ష రద్దుకావడంతో 16 లక్షల మంది మహిళలతో సహా 48 లక్షల మంది అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు. పీఎం సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో 14 ప్రధాన పరీక్షల ప్రశ్నపత్రాల బహిర్గతమయ్యాయి. యూపీ, మధ్యప్రదేశ్, హరియాణా బీజేపీ పాలిత రాష్ట్రాలు కుంభకోణాల జాబితాలో ఉన్నాయి. 2024 ఫిబ్రవరిలో పబ్లిక్ పరీక్షల (తప్పుడు మార్గాల నివారణ) చట్టం ఆమోదించినా, ఇప్పటికే పలు కుంభకోణాలు వెలుగు చూసినా.. ఆ చట్టం అమల్లోకి రాలేదు.

విశ్వసనీయత కాపాడాలి...
జాతీయస్థాయిలో నిర్వహించే పరీక్షల విశ్వసనీయత కాపాడాలి. పేపర్ లీకేజీ, అవినీతిలో భాగమైన వారు ఎంతటి వారైనా, ఏ స్థాయిలో ఉన్నా కఠిన శిక్షలు విధించాలి. నీట్ 2026కు దేశవ్యాప్తంగా 551, విదేశాల్లో 14 నగరాల్లోని కేంద్రాల్లో దాదాపు 22.79 లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ప్రశ్నపత్రం లీకేజీ, పరీక్షవిధానంలో లోపాలు, అక్రమాలతో విద్యార్థులంతా ఆందోళనలో ఉన్నారు. ప్రశ్నపత్రం లీకేజీపై కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పారదర్శకంగా, నిర్ణీత వ్యవధితో కూడిన, విశ్వసనీయ విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నా. వ్యవస్థాపరమైన వైఫల్యాల కారణంగా అమాయక విద్యార్థులు పదేపదే ఇబ్బందులు పడకూడదని కోరుతున్నాం. ఎంతో మానసిక ఒత్తిడి, ఆర్థిక భారంతో విద్యార్థులు నీట్‌కు సన్నద్ధమవుతుంటారు. పోటీపరీక్షలు విద్యార్థుల ప్రతిభ, అవకాశాలకు వేదికగా ఉండాలి.. కానీ ఆందోళనకు, అనిశ్చితికి కారణం కాకూడదు.

తెలంగాణ విద్యార్థులకు అండగా ఉంటాం..
తాజా సంక్షోభం కారణంగా ప్రభావితమైన విద్యార్థులు, తల్లిదండ్రులకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుంది. సాధ్యమైనంత మద్దతు ఇస్తుంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పరీక్షల నిర్వహణలో బలమైన రక్షణాత్మక చర్యలు, సాంకేతికంగా భద్రత, వ్యవస్థల్లో జవాబుదారీతనం ఉండాలి. విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందకూడదు'' అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

జూన్ 25 నుంచి 'సర్'

'ఈ నెలాఖరు నుంచి అక్టోబరు 14వ తేదీ వరకు 16 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో 3.94 లక్షల మంది బూత్‌స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి 36.73 కోట్ల మంది ఓటర్లను కలుస్తారు. వారికి రాజకీయ పార్టీలు నియమించిన 3.42 లక్షల మంది బూత్‌స్థాయి ఏజెంట్లు సహకారం అందిస్తారు. ఇప్పటివరకు తొలి రెండు దశలను 59 కోట్ల ఓటర్లున్న 13 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో నిర్వహించాం. అందులో 6.3 లక్షల మంది బూత్‌స్థాయి అధికారులు, 9.2 లక్షల మంది బూత్‌స్థాయి ఏజెంట్లు పాలు పంచుకున్నారు' అని ఎన్నికల సంఘం తెలిపింది.

మూడో దశలో సర్ జరిగే రాష్ట్రాలు
1)ఆంధ్రప్రదేశ్, 2)అరుణాచల్‌ప్రదేశ్, 3) హరియాణా, 4)ఝార్ఖండ్, 5)కర్ణాటక, 6)మహారాష్ట్ర, 7)మణిపుర్, 8)మేఘాలయ, 9)మిజోరం, 10) నాగాలాండ్, 11)ఒడిశా, 12)పంజాబ్, 13)సిక్కిం, 14)త్రిపుర, 15)తెలంగాణ, 16)ఉత్తరాఖండ్.

కేంద్రపాలిత ప్రాంతాలు
చండీగఢ్, దాద్రానగర్ హవేలీ, దామన్‌దీవు, దిల్లీ.

ప్రతి ఇంటికి రెండు గణన పత్రాలు
ఉమ్మడి రాష్ట్రంలో చివరిసారిగా 2002లో ఎస్ఐఆర్ సర్వే జరిగింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత మొదటిసారి చేపట్టనున్నారు. ఇప్పటికే అధికారులు 2002 నాటి, తాజా ఓటర్ల జాబితాలను బీఎల్‌వోలకు అందించారు. వారు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లకు రెండు గణనపత్రాలను ఇస్తారు. పూర్తి చేసిన ఒక ప్రతిని తీసుకుని, రెండోది ఓటరుకు రసీదుగా అందిస్తారు. ఓటర్లు గణనపత్రాలను ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఆన్‌లైన్‌లోనూ సమర్పించవచ్చు. ఆన్‌లైన్ దరఖాస్తులను సైతం బీఎల్‌వోలు ఇంటింటి సర్వేకు వచ్చినప్పుడు ధ్రువీకరణ చేస్తారు.

అభ్యంతరాలుంటే అప్పీలుకు వెళ్లొచ్చు
జులై 31న ప్రచురించే ముసాయిదా జాబితాలో పేరు రాకున్నా, ఓటరు నమోదులో ఎన్నికల నమోదు అధికారి(ఈఆర్వో) తీసుకున్న నిర్ణయంపై సంతృప్తి చెందకున్నా... జిల్లా మేజిస్ట్రేట్‌కు అప్పీల్ చేసుకోవచ్చు. మొదటి అప్పీల్ నిర్ణయంపై అభ్యంతరముంటే రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి(సీఈవో)కి రెండో అప్పీల్ చేసుకునే అవకాశముంది.

సర్వేలో పాల్గొనలేకపోతే ఏం చేయాలంటే...
సర్వే సమయంలో ఓటర్లు తమ వివరాలను నమోదు చేసుకోలేకపోతే, వివిధ కారణాలతో పాల్గొనలేకపోతే... జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు ఉండే అభ్యంతరాలు, ఫిర్యాదుల సమయంలో ఫాం6 సమర్పించి తమ పేరును నమోదు చేసుకోవచ్చు. కొత్త ఓటరు సైతం ఇదే ఫారాన్ని వాడాల్సి ఉంటుంది. పూర్తి వివరాలను సమర్పించని ఓటర్ల విషయంలోనూ ఈఆర్వో/ఏఈఆర్వో విచారణ చేపడతారు. నియోజకవర్గం పరిధిలో లేదా బయట చిరునామా మార్పు, సవరణ, ఎపిక్ కార్డు మార్పు, దివ్యాంగుల(పీడబ్ల్యూడీ) గుర్తింపునకు ఫా8 సమర్పించవచ్చు. రాష్ట్రం వెలుపల నుంచి వచ్చే ఓటర్లు డిక్లరేషన్ ఫాం సమర్పించాలి.

ఇప్పటికే కొనసాగుతున్న మ్యాపింగ్
సర్ సన్నద్ధతలో భాగంగా రాష్ట్రంలో ఇప్పటికే చేపట్టిన మ్యాపింగ్ ఆరు నెలలుగా కొనసాగుతోంది. హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల పరిధిలోని 28 శాసనసభ నియోజకవర్గాల్లో ఇప్పటివరకు 50% ప్రక్రియ కూడా పూర్తి కానట్లు తెలుస్తోంది.

తాజాగా ఇప్పటివరకు జరిగిన దశలు: 2
తొలిదశ ఎక్కడ: పైలట్ ప్రాజెక్టు కింద బిహార్‌లో మొదలు పెట్టారు. అక్కడ 47 లక్షల మంది ఓటర్లను తొలగించారు.
రెండోదశ: 9 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో జరిగింది. మొత్తంగా 7.36 కోట్ల మంది ఓటర్లను తొలగించారు. ఈ దశలో కొత్తగా 2.18 కోట్ల మంది ఓటర్లను జతచేశారు. దీంతో నికర ఓటర్ల తొలగింపు 5.18 కోట్లకు చేరింది.

తొలగింపుతోపాటు కొత్తగా చేరికలు
సర్ రెండో విడతకు ముందు 9 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో మొత్తం ఓటర్ల సంఖ్య 50.99 కోట్లు ఉండగా, తర్వాత 45.81 కోట్లకు తగ్గింది. అత్యధికంగా ఉత్తర్‌ప్రదేశ్‌లో 2.05 కోట్ల ఓటర్ల తొలగింపు జరిగింది. తర్వాతి స్థానాల్లో పశ్చిమబెంగాల్(83.86లక్షలు), తమిళనాడు(74 లక్షలు) ఉన్నాయి. కొత్తగా ఓటర్ల జాబితాలో చేరినవారి పేర్లు అత్యధికంగా ఉత్తర్‌ప్రదేశ్(92.4 లక్షలు), తమిళనాడు(35 లక్షలు), కేరళ(20.4 లక్షలు) రాష్ట్రాల్లో ఉన్నాయి.

'సర్' ఉద్దేశం ఏంటంటే...?
ఉద్దేశం: చనిపోయిన వారు, డూప్లికేట్, శాశ్వతంగా తరలిపోయిన వారు, అనర్హుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించి... అర్హుల పేర్లను మాత్రమే ఉండేలా చూడటం. విధానం: బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి పరిశీలిస్తారు. ఓటర్లు భర్తీ చేసిన ఎన్యుమరేషన్(గణన) ఫారాలను... పాత ఓటరు డేటాతో పోల్చి చూస్తారు.

ఇప్పటివరకు ఎన్నిసార్లు చేశారు: 19512004 మధ్య కాలంలో ఎనిమిదిసార్లు ఇలాంటి కసరత్తు చేశారు. చివరిగా 200104 మధ్యజరిగింది.

తాళం వేసి ఉంటే మూడుసార్లు
తెలంగాణలో ఈ నెల 12వ తేదీ వరకు 3,39,20,705 మంది ఓటర్లు ఉన్నారు. 35,985 మంది బీఎల్‌వోలు, 25,886 మంది బీఎల్ఏలు ఉన్నారు. మొత్తం 33 జిల్లాల్లోని 13 కార్పొరేషన్లు, 129 పట్టణాలు, 12,769 గ్రామపంచాయతీల వివరాలను విభాగాల వారీగా అధికారులు గుర్తించి పెట్టుకున్నారు. రాష్ట్రంలోని సుమారు 83.04 లక్షల కుటుంబాల వద్దకు వెళ్లి బీఎల్‌వోలు సర్వే నిర్వహిస్తారు. వారు వెళ్లినప్పుడు తాళం ఉంటే కనీసం మూడుసార్లు ఆ ఇంటిని సందర్శించాల్సి ఉంటుంది.

జాబితాలో అనర్హులు ఉండొద్దు
ఓటర్ల జాబితాలో అర్హుల పేర్లు మాత్రమే ఉండేలా చూడటానికే 'సర్' నిర్వహిస్తున్నాం. అనర్హుల పేర్లు ఉండటానికి వీల్లేదు. అందుకే ఓటర్లంతా ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని, ఎన్యుమరేషన్ ఫారాలు నింపాలి.

రాయలసీమ ఇకపై రక్షణ సీమ

ఈకబురు,,అమరావతి, మే 14:
రాయల సీమ రతనాల సీమ... ఇది చరిత్ర. ఉద్యాన సీమ... ఇది వర్తమానం. రక్షణ సీమ... ఇది భవిష్యత్. ఇరిగేషన్, హార్టీకల్చర్, స్పేస్, డ్రోన్, సోలార్, విండ్ ఎనర్జీ వంటి రంగాల్లో దూసుకెళ్తున్న రాయలసీమ డెవలప్మెంట్ జర్నీలో మరో కీలక రంగం జత కానుంది. ఇకపై రాయలసీమ దేశ రక్షణ రంగంలోనూ తన ముద్రను వేయబోతోంది. ప్రత్యేకతను చాటుకోనుంది. నేడు శ్రీ సత్యసాయి జిల్లాలో దేశం గర్వించే అత్యంత ప్రతిష్టాత్మకమైన అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (AMCA) డిఫెన్స్ ప్రాజెక్టును ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీడీఆర్డీఏ సంస్థలు సంయుక్తంగా ఏర్పాటు చేయనున్నారు. పుట్టపర్తిలో జరగనున్న ఈ కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భూమి పూజ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ పాల్గొననున్నారు. ఈ ప్రాజెక్టును సుమారు రూ.15,803 కోట్ల భారీ వ్యయంతో, 650 ఎకరాల్లో ఈ రూపుదిద్దుకోనుంది. ఇది భారతదేశపు మొట్టమొదటి 5th Generation స్టెల్త్ మల్టీరోల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్ట్. ఇందులో స్టెల్త్ టెక్నాలజీ, ట్విన్ ఇంజిన్ సూపర్ క్రూయిజ్ సామర్థ్యం, అత్యాధునిక ఏవియానిక్స్ వంటి హంగులతో యుద్ధ విమానాలను అభివృద్ధి చేయనున్నారు. యుద్ధ విమానాలను పుట్టపర్తిలోనే అభివృద్ధి చేయడంతోపాటు... టెస్టింగ్ కూడా చేపట్టేలా ప్రాజెక్టును రూపొందించనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 7,500 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అంచనా. అలాగే, ఈ ప్రధాన ప్రాజెక్టుకు అనుబంధంగా వచ్చే ఇతర యూనిట్ల ద్వారా మరో రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది. దీని కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా 400 ఎకరాలు కేటాయించింది. వీటితో పాటు కర్నూలు జిల్లాలో నిర్మిస్తున్న 'డ్రోన్ సిటీ' ద్వారా భారతదేశంలోనే అత్యుత్తమ డ్రోన్ ఎకోసిస్టమ్‌ను ప్రభుత్వం సిద్ధం చేస్తోంది.

ఆ మేరకు పెట్టుబడులు భారీ ఎత్తున రానున్నాయి. మొత్తంగా రాయలసీమ, ప్రకాశం జిల్లాల పరిధిలో డిఫెన్స్, డ్రోన్ రంగాల్లో పెద్ద ఎత్తున పెట్టుడులు వచ్చేందుకు ప్రభుత్వం గ్రౌండ్ ప్రిపేర్ చేస్తోంది. దీంట్లో భాగంగా డ్రోన్ ప్రాజెక్టుల ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. AMCA ప్రాజెక్టుతో పాటే డిఫెన్స్ రంగానికి చెందిన 4 ప్రాజెక్టులు, 8 డ్రోన్ ప్రాజెక్టులకు శంకుస్థాపన జరగనుంది. ఈ 12 ప్రాజెక్టుల ద్వారా రూ. 4145 కోట్ల పెట్టుబడులు, 6071 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. వీటిల్లో మడకశిరలో రెండు ప్రాజెక్టులు, దొనకొండ, నెల్లూరుల్లో ఒక్కో ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. మిగిలిన 8 డ్రోన్ ప్రాజెక్టులు కర్నూలు జిల్లా డ్రోన్ సిటీలో నిర్మాణాలు చేపట్టనున్నాయి.

ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్
ముఖ్యమంత్రి పర్యటన ఉదయం 08:15 గంటలకు క్యాంప్ కార్యాలయం నుంచి బయలుదేరి 09:45 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా ఉదయం 10:15 గంటలకు పుట్టపర్తి ఎయిర్‌పోర్ట్ వెనుక ఏర్పాటు చేసిన ఉన్న శంకుస్థాపన కార్యక్రమ వేదికకు చేరుకుంటారు. ఉదయం 10:15 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ అథారిటీ (ADA) ఆధ్వర్యంలోని ఎయిర్‌క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ ఫ్లైట్ టెస్ట్ సెంటర్ శంకుస్థాపనతో పాటు, ఇతర రక్షణ, డ్రోన్ రంగ పరిశ్రమల భూమి పూజ కార్యక్రమాల్లో రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో కలిసి పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 02:20 గంటలకు తిరిగి అమరావతిలోని తన నివాసానికి చేరుకుంటారు.

మరో 12 ప్రాజెక్టులకు శంకుస్థాపన
- కళ్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్ లిమిటెడ్ – రూ. 1430 కోట్ల పెట్టుబడి – 565 మందికి ఉపాధి
- భారత్ డైనమిక్స్ లిమిటెడ్ – రూ. 489 కోట్ల పెట్టుబడి – 500 మందికి ఉపాధి
- HFCL – రూ. 1040 కోట్ల పెట్టుబడి – 870 మందికి ఉపాధి
- ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్స్ – రూ. 500 కోట్ల పెట్టుబడి – 2050 మందికి ఉపాధి
- అల్గోబాటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ – రూ. 34 కోట్ల పెట్టుబడి – 52 మందికి ఉపాధి
- డ్రోగో డ్రోన్స్ ప్రైవేట్ లిమిటెడ్ – రూ. 255 కోట్ల పెట్టుబడి – 850 మందికి ఉపాధి
- డ్రోన్ ల్యాబ్ టెక్నాలజీస్ – రూ. 5 కోట్ల పెట్టుబడి – 14 మందికి ఉపాధి
- హెచ్ సి రోబోటిక్స్ – రూ. 100 కోట్ల పెట్టుబడి – 500 మందికి ఉపాధి
- సెన్స్ ఇమేజ్ టెక్నాలజీస్ – రూ. 68 కోట్ల పెట్టుబడి – 45 మందికి ఉపాధి
- ఎయిర్ పేస్ ఇండస్ట్రీస్ – రూ. 100 కోట్ల పెట్టుబడి – 150 మందికి ఉపాధి
- జేడీకే ఫ్లై డ్రోన్ వరల్డ్ – రూ. 114 కోట్ల పెట్టుబడి – 350 మందికి ఉపాధి
- లాట్రిక్ ఎయిరో స్పేస్ – రూ. 10 కోట్ల పెట్టుబడి – 125 మందికి ఉపాధి

వ్యాసాశ్రమంలో పరంపర పతనమా..?

తిరుపతి, మే 14 ఈకబురు,
ఓం నమోభగవతే మలయతీంద్రాయ... మహర్షి శ్రీ సద్గురు మలయాళస్వామి వారు ఆధ్యాత్మికత, సమానత్వం, సేవా ధర్మం, విద్యా ప్రచారం లక్ష్యాలతో స్థాపించిన పవిత్రమైన శ్రీ వ్యాసాశ్రమం నేడు తన అసలు పరంపరను కోల్పోతుందనే ఆవేదన భక్తుల్లో వ్యక్తమవుతోంది. ఆశ్రమ పరిపాలనలో జరుగుతున్న అనేక పరిణామాలు గురుదేవుల ఆశయాలకు విరుద్ధంగా ఉన్నాయని భక్తులు, పూర్వ విద్యార్థులు, ఆధ్యాత్మిక వర్గాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

ఒకప్పుడు దేశ నలుమూలల నుండి భక్తులు, విద్యార్థులు, సన్యాసులు తరలివచ్చే ఈ ఆశ్రమంలో ప్రస్తుతం సాధారణ భక్తులకు కూడా ప్రవేశం కష్టంగా మారిందని విమర్శలు వినిపిస్తున్నాయి. గురుదేవులు స్వయంగా స్థాపించిన పూజామందిరంలో నిత్య పూజలు, పునస్కారాలు సరిగా జరగకపోవడం భక్తులను తీవ్రంగా కలచివేస్తోంది. ఆశ్రమ ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలిచిన గోశాల, సాధుసత్రం, అసంగానంద వైద్యశాల, బ్రహ్మవిద్యా పాఠశాల, సంస్కృత పాఠశాలలు నిలిచిపోవడం పట్ల భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇంకా ఆశ్రమ పరిపాలనలో పారదర్శకత లేకుండా ఉత్తర పీఠాధిపతిగా కుటుంబ సభ్యుడినే గుట్టుచప్పుడు కాకుండా ప్రకటించారనే ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. ఆశ్రమం వంటి ఆధ్యాత్మిక సంస్థలో కులవ్యవస్థ, బంధుప్రీతి పెరుగుతున్నాయనే విమర్శలు కూడా వ్యక్తమవుతున్నాయి. మహిళల కోసం ప్రత్యేకంగా నిర్మించిన నిష్ఠాశ్రమం, అన్నపూర్ణాశ్రమం, లక్ష్మీనిలయం వంటి భవనాలు పాడుబడిపోవడం, అనాథలు, వితంతువులకు ఆశ్రయం లేకుండా పోవడం ఆశ్రమ సేవా ధర్మం ఎటు పోతుందనే ప్రశ్నలను లేవనెత్తుతోంది. మరోవైపు ఆశ్రమానికి చెందిన విలువైన స్థలాలు, ముద్రణశాల భూములు అమ్మివేయడం, పూర్వ విద్యార్థుల నిర్మాణాలను పట్టించుకోకపోవడం, తిరుమల గోగర్భక్షేత్రం నిర్వహణను బంధువులకు అప్పగించారనే ఆరోపణలు భక్తుల్లో అనుమానాలకు తావిస్తున్నాయి. కన్యా గురుకులం వంటి మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదేశాల్లో పురుషుల ప్రవేశం కొనసాగుతుండడంపై కూడా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. గురుదేవుల ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకగా నిలిచిన గురుపూజలు సైతం సరైన రీతిలో నిర్వహించకపోవడం పట్ల భక్తులు తీవ్ర మనోవేదన వ్యక్తం చేస్తున్నారు.

"మహర్షి మలయాళస్వామి ఆశయాలను కాపాడాల్సిన ఆశ్రమమే నేడు తన అసలు లక్ష్యాలను కోల్పోతుందా?" అనే ప్రశ్న భక్త వర్గాల్లో వినిపిస్తోంది. ఆశ్రమ పరిపాలనపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో పూర్తి స్థాయి పారదర్శక విచారణ జరిపి, గురుదేవుల పరంపరను పునరుద్ధరించాలని భక్తులు, పూర్వ విద్యార్థులు, ఆధ్యాత్మిక వర్గాలు ప్రభుత్వాన్ని మరియు సంబంధిత అధికారులను కోరుతున్నారు. (మరిన్ని అక్రమాలు వచ్చే సంచికలో వెలుగులోకి)

కేటీఆర్ తో ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ భేటీ

ఈకబురు,, హైదరాబాద్ :
భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో భారతదేశంలోని ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఆస్ట్రేలియా కాన్సల్ జనరల్ హిల్లరీ మెక్‌గీచీ తో గురువారం సమావేశమయ్యారు. నందినగర్ లో జరిగిన ఈ భేటీలో పరస్పర ప్రయోజనాలు మరియు వ్యూహాత్మక అంశాలపై విస్తృతంగా చర్చించడమైనది.ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఆస్ట్రేలియా పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, సాంకేతిక రంగంలో పరస్పర సహకారం, మరియు విద్యారంగంలో నూతన భాగస్వామ్యాల గురించి ఈ సమావేశంలో ప్రస్తావించారు. గతంలో పరిశ్రమలు ఐటీ శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవమున్న కేటీఆర్ ఈ అంశంలో అనేక అంశాలపై చర్చించారు. ఐటీ, గ్రీన్ ఎనర్జీ, ఫార్మా, మరియు ఇన్నోవేషన్ రంగాల్లో హైదరాబాద్ కేంద్రంగా జరుగుతున్న అభివృద్ధిపై... తెలంగాణ మరియు ఆస్ట్రేలియా మధ్య సహకారం భవిష్యత్తులో స్థానిక యువతకు మరిన్ని అంతర్జాతీయ అవకాశాలను కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశాయి.భారత్ మరియు ఆస్ట్రేలియా మధ్య ఉన్న దృఢమైన మైత్రిని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే దిశగా ఈ చర్చలు సాగాయి. ఆస్ట్రేలియా ప్రతినిధులతో జరిగిన ఈ భేటీ పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, ఈ భాగస్వామ్యం ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థలకు మరియు సాంస్కృతిక బంధాలకు మరింత బలాన్ని చేకూరుస్తుందని పేర్కొనడం జరిగింది.

ఇష్టమైన రంగాలను ఎంపిక చేసుకొని..

ఉత్తమ నిపుణులుగా రాణించండి

గీతం "నేషనల్ విద్యా ఇమ్మర్షన్" లో ప్రొఫెసర్ సంజీవ్ కుమార్ సూచన

ఈకబురు, పటాన్ చెరు :
ఎంపిక చేసుకున్న రంగంలో నిపుణులుగా ఎదిగి, ఆయా వృత్తులలో మేటివారిగా రాణించాలని గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ లోని టెలివిజన్ ప్రసార కోర్సులు, ప్రయోగాత్మక యానిమేషన్, మీడియా నిర్వహణ పద్ధతులు విభాగాధిపతి ప్రొఫెసర్ సంజీవ్ కుమార్ విద్యార్థులకు సూచించారు. పూణేలోని ఎంఐటీడబ్ల్యూపీయూ విశ్వవిద్యాలయ సహకారంతో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులో నిర్వహించిన రెండు వారాల 'జాతీయ విద్యా ఇమ్మర్షన్ కార్యక్రమం' గురువారంతో ముగిసింది.

సెమినార్ లో విద్యార్థుల కల్చరల్ ప్రోగ్రామ్స్

భవిష్యత్ తరానికి చెందిన మీడియా నిపుణులను తీర్చిదిద్దే లక్ష్యంతో రూపొందించిన ఈ కార్యక్రమ ముగింపు వేడుకలో డాక్టర్ సంజీవ్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం యొక్క నిజమైన విలువ కేవలం విద్యాపరమైన వినిమయంలోనే కాకుండా, పాల్గొనేవారి మధ్య ఉన్న జిజ్ఞాస, సహకారం, పరస్పర సంభాషణ స్ఫూర్తిలో కూడా ఉందని అన్నారు. నూతన ఆవిష్కరణలను, అర్థవంతమైన విద్యాపరమైన భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే వేదికను కల్పించినందుకు ఆయన ఎంఐటీ వర్సిటీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ చొరవన్ కార్యక్రమం, విద్యార్థులకు సమకాలీన మీడియా పద్ధతులు, కమ్యూనికేషన్ వ్యూహాలు, డిజిటల్ స్టోరీటెల్లింగ్, పరిశ్రమ ఆధారిత శిక్షణపై విస్తృతమైన అవగాహనను అందించింది. నిపుణుల ఉపన్యాసాలు, కార్యశాలలు, ముఖాముఖి కార్యక్రమాలు, ఆచరణాత్మక అభ్యాస అనుభవాల ద్వారా, విద్యాపరమైన జ్ఞానానికి, వృత్తిపరమైన మీడియా పరిశ్రమ అవసరాలకు మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చడమే ఈ లక్ష్యంగా ఇది కొనసాగింది.
రెండు విద్యా సంస్థల అధ్యాపకులు, ప్రముఖులు ఈ రెండు సంస్థల మధ్య మరింత బలమైన సహకారానికి నాంది పలికిందన్నారు.
ఎంఐటీడబ్ల్యూపీయూ ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ అనునాయర్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమంలో 71 మంది విద్యార్థుల ఉత్సాహభరితమైన భాగస్వామ్యాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. గీతంతో మరిన్ని సహకార కార్యక్రమాల కోసం తమ సంస్థ ఎదురు చూస్తోందని ఆమె తెలిపారు. విద్యార్థులు ఆయా సెషన్లలో చురుకుగా పాల్గొన్నారని, ముఖ్యంగా ఆచరణాత్మక అభ్యాస అనుభవాలను ఆస్వాదించారని చెప్పారు.మే 1 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించిన ఈ ఇమ్మర్షన్ కార్యక్రమం, విద్యార్థులకు సమకాలీన మీడియా పద్ధతులు, కమ్యూనికేషన్ వ్యూహాలు, డిజిటల్ స్టోరీటెల్లింగ్, పరిశ్రమ ఆధారిత శిక్షణపై విస్తృతమైన అవగాహనను అందించింది. నిపుణుల ఉపన్యాసాలు, కార్యశాలలు, ముఖాముఖి కార్యక్రమాలు, ఆచరణాత్మక అభ్యాస అనుభవాల ద్వారా, విద్యాపరమైన జ్ఞానానికి, వృత్తిపరమైన మీడియా పరిశ్రమ అవసరాలకు మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చడమే ఈ లక్ష్యంగా ఇది కొనసాగింది.

ఎన్ఏఐపీ ప్రోగ్రామ్ లో పాల్గొన్న విద్యార్థులతో హెచ్ ఓ డీలు, ఇతర అతిథులు

సెమినార్ లో విద్యార్థుల కల్చరల్ ప్రోగ్రామ్స్

రెండు విద్యా సంస్థల అధ్యాపకులు, ప్రముఖులు ఈ ఉమ్మడి కృషిని ప్రశంసించారు. సామాజిక బాధ్యత కలిగిన, పరిశ్రమకు సిద్ధంగా ఉన్న మీడియా నిపుణులను తీర్చిదిద్దడంలో అనుభవపూర్వక అభ్యాసం, వివిధ రంగాల పరిజ్ఞానం, విద్యా భాగస్వామ్యాల ప్రాముఖ్యతను వారు నొక్కి చెప్పారు.తమ ప్రతిస్పందనలో విద్యార్థులు ఈ కార్యక్రమం గురించి సానుకూల స్పందనను పంచుకున్నారు. ముఖ్యంగా ప్రయోగాత్మక యానిమేషన్ తరగతులు, మోషన్ గ్రాఫిక్స్ సెషన్లు, ఆడియో ప్రొడక్షన్‌సౌండ్ డిజైన్ కార్యశాలలు, అలాగే పీసీఆర్ గదిలో మూడు ప్రాజెక్టులను రూపొందించిన ప్రత్యక్ష అనుభవాన్ని వారు ప్రశంసించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన రెండు లఘు వీడియోలను కూడా ప్రదర్శించారు

.ఇందులో పాల్గొన్నవారు తమ అభ్యాస అనుభవాలను సమీక్షించుకోవడంతో వీడ్కోలు కార్యక్రమం ముగిసింది. అనంతరం సామూహిక ఛాయాచిత్రాల (గ్రూపు ఫోటో) కార్యక్రమం జరిగింది.

మరోసారి లాయరైన మమత

టీఎంసీ కార్యకర్తలు, మైనారిటీలపై దాడులు జరిగాయి
ఎన్నికల అనంతర హింసపై కలకత్తా హైకోర్టులో వాదనలు
శాంతిభద్రతలను కాపాడాలంటూ ప్రభుత్వానికి కోర్టు ఆదేశం

ఈకబురు, కోల్‌కతా/న్యూఢిల్లీ: టీఎంసీ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ మరోసారి నల్ల కోటు వేసుకుని కోర్టులో వాదనలు వినిపించారు. రాష్ట్రంలో ఎన్నికల అనంతర హింస పెచ్చరిల్లిందంటూ ఆరోపించారు. టీఎంసీ కార్యకర్తలు, మైనారిటీలే లక్ష్యంగా దాడులు జరిగాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో సర్ సందర్భంగా అక్రమాలు జరిగాయంటూ ఫిబ్రవరిలో మమత నల్లకోటు ధరించి సుప్రీంకోర్టులో వాదనలు వినిపించడం తెల్సిందే.
కాగా, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన మే 4వ తేదీ నుంచి టీఎంసీ పార్టీ కార్యాలయాలు, కార్యకర్తలపై దాడు లు జరుగుతున్నాయని సిర్సన్యా బందోపా ధ్యాయ వేసిన పిల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పౌల్ సారథ్యంలోని ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ఎంపీ కల్యాణ్ బెనర్జీ కుమారుడైన సిర్సన్యా బందోపాధ్యాయ ఇటీవల ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. హైకోర్టులో మొదటిసారిగా హాజరైన మమత.. కల్యాణ్ బెనర్జీకి తోడుగా వాదనలు వినిపించారు. దాడులకు పాల్పడే వారి నుంచి ప్రజలను కాపాడాలని హైకోర్టు ను కోరారు.
ఎన్నికల అనంతరం జరిగిన దాడుల్లో కనీసం 10 మంది చనిపోగా, 160 మంది టీఎంసీ కార్యాలయాలను ధ్వంసం చేశారని, కనీసం 2 వేల హింసాత్మక ఘటనలు నమోదయ్యాయని చెప్పారు. చేపలు, మాంసం దుకాణాలనూ లక్ష్యంగా చేసుకున్నారన్నారు. కోల్‌కతాలో అక్రమ కట్టడాలను కొత్తగా వచ్చిన సువేందు అధికారి ప్రభుత్వం కూల్చివేస్తుండటాన్ని మమత ప్రస్తావిస్తూ 'యూపీ మాదిరిగా బెంగాల్ బుల్‌డోజర్ రాష్ట్రం కాదు'అని పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. స్పందించిన ధర్మాసనం.. క్షేత్రస్థాయిలో శాంతిభద్రతలను తప్పనిసరిగా కాపాడాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.
హింసాత్మక వాతావరణంలో ఇళ్లు వదిలి వెళ్లిపోయిన వారు తిరిగి సురక్షితంగా చేరుకునేందుకు అనువైన వాతావరణం కల్పించాలని కోరింది. ఈ విషయంలో పార్టీలకతీతంగా వ్యవహరించాలంది. మూడు వారాల్లోగా అఫిడవిట్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. మరీ అవసరమనిపిస్తే మరో రెండు వారాలు సమయం తీసుకోవచ్చని తెలిపింది. కాగా, తీర్పు అనంతరం మమత కోర్టు ప్రాంగణం నుంచి వెళ్లిపోతుండగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. కొందరు లాయర్లు ఆమెనుద్దేశించి దొంగ.. దొంగ అంటూ కేకలు వేశారు. కోర్టు తీర్పును తమ విజయంగా టీఎంసీ అభివర్ణించింది. బీజేపీ నిజం స్వరూపం బయటపడిందంటూ వ్యాఖ్యానించింది.
బీసీఐ సీరియస్..
మమత హైకోర్టులో వాదనలు వినిపించారంటూ వచ్చిన వార్తలపై బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) స్పందించింది. మమత లాయర్‌గా నమోదయ్యారా? ఒక వేళ అయితే సీఎంగా ఉండగా 2011-2026 మధ్య కాలంలో ఆమె లాయర్ సభ్యత్వం పరిస్థితి ఏమిటి?వంటి వివరాలను 48 గంటల్లోగా అందజేయాలని పశ్చిమ బెంగాల్ బార్ కౌన్సిల్‌ను కోరింది. రాజ్యాంగ పదవి, లాభదాయక ఉద్యోగాల్లో ఉన్నవారు, ఆ కాలంలో బార్ లైసెన్స్‌ను తాత్కాలికంగా రద్దు చేసుకోవాల్సి ఉంటుంది.

హార్మూజ్‌ను దాటిన 2 భారతీయ నౌకలు

ఈకబురు న్యూఢిల్లీ: హార్మూజ్ వద్ద ఉద్రిక్తత కొనసాగుతున్నా ఎల్పీజీ సరకుతో వస్తున్న రెండు సరకురవాణా నౌకలు విజయవంతంగా జలసంధిని దాటాయి. 'సైమీ'ఎల్పీజీ ట్యాంకర్ మే 13వ తేదీన హార్మూజ్‌ను దాటగా ఎన్‌వీ సన్‌షైన్ అనే మరో ఎల్పీజీ నౌక గురువారం దాటింది. ఈ రెండు నౌకలతో కలిపి గత రెండు నెలల్లో హార్మూజ్‌ను దాటి భారతీయ నౌకల సంఖ్య 13కు పెరిగింది.
యూఏఈలోని రువాయిస్ రిఫైనరీ నుంచి బయల్దేరిన సైమీ నౌకలో దాదాపు 20,000 టన్నుల ఎల్పీజీ నిల్వలున్నాయి. ఇది మే 16వ తేదీకల్లా గుజరాత్‌లోని కాండ్లా నౌకాశ్రయానికి చేరుకునే ఆస్కారముంది. ఎన్‌వీ సన్‌షైన్ నౌకలో ఏకంగా 46,427 టన్నుల ఎల్పీజీ ఉంది. ఇది మే 18వ తేదీకల్లా న్యూ మంగళూరు పోర్ట్‌కు చేరుకునే అవకాశముందని కేంద్ర పోర్ట్‌లు, షిప్పింగ్, వాటర్‌వేస్ శాఖ అదనపు కార్యదర్శి ముకేశ్ మంగళ్ తెలిపారు. ఈ రెండు నౌకలను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ భారత్‌కు రప్పిస్తోంది.

ఆగని దాడుల పరంపర..

కొన్ని నౌకలు విజయవంతంగా హార్మూజ్‌ను దాటుతున్నా మరి కొన్నింటిపై దాడులు కొనసాగుతున్నాయి. గతంలో రెండు నౌకలపై దాడి జరగ్గా ఇప్పుడు మరో నౌకపై మెరుపుదాడి చేశారు. దీంతో సోమాలియా నుంచి షార్జాకు వెళ్తున్న భారతీయ జెండాతో ఉన్న సంప్రదాయక సరకు రవాణా నౌక 'హాజీ అలీ'యాత్ర విషాదంగా ముగిసింది. బుధవారం తెల్లవారుజామున ఒమన్ ప్రాదేశిక సముద్రజలాల గుండా ప్రయాణిస్తున్నప్పుడు ఈ నౌకపై దాడి జరిగింది.
''57 మీటర్ల పొడవు, 14 మీటర్ల వెడల్పున్న ఈ నౌక ప్రధాన భాగం చెక్కతో నిర్మించడంతో మంటలు వేగంగా వ్యాపించాయి. దీంతో నౌక తీవ్రంగా దెబ్బతిని సముద్రజలాల్లో మునిగిపోయింది. ఈలోపు విషయం తెల్సుకుని ఒమన్ తీరగస్తీ దళాలు ఘటనా స్థలికి చేరుకున్నాయి. నౌకలోని 14 మంది సిబ్బందిని కాపాడాయి.
నావికులందరినీ త్వరలోనే భారత్‌కు తరలిస్తాం. నౌకపై ఎవరు దాడి చేశారనేది ఇంకా తెలియాల్సి ఉంది. స్వేచ్ఛా వాణిజ్యాన్ని అడ్డుకుంటూ వాణిజ్య నౌకలపై దాడి, నావికులకు ప్రాణహాని కల్గించే ఇలాంటి చర్యలు ఏమాత్రం ఆమోదనీయం కాదు''అని అదనపు కార్యదర్శి ముకేశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

సతీశన్ ఆచరణాత్మక రాజకీయవేత్త

ఈకబురు,న్యూఢిల్లీ/తిరువనంతపురం: కేరళ కొత్త ముఖ్యమంత్రి ఎవరన్నదానిపై 10 రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు, ఊహాగానాలకు తెరపడింది. సీనియర్ నేత వి.డి.సతీశన్‌కు సీఎం పీఠం కట్టబెట్టాలని కాంగ్రెస్ అధిష్టానం గురువారం నిర్ణయించింది. ఇప్పటిదాకా జరిగిన చర్చల ఆధారంగా సతీశన్‌ను కాంగ్రెస్ శాసనసభాపక్ష(సీఎల్పీ) నాయకుడిగా నియమించాలని నిర్ణయించినట్లు కేరళ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ వెల్లడించారు.
ఆమె గురువారం ఢిల్లీలో కాంగ్రెస్ పరిశీలకులు అజయ్ మాకెన్, ముకుల్ వాస్నిక్, సీనియర్ నేత జైరామ్ రమేశ్‌తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 7న తిరువనంతపురంలో జరిగిన సీఎల్పీ సమావేశంలో..రాష్ట్రంలోసీఎల్పీకి కొత్త నాయకుడిని నియమించే విషయంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు పూర్తి అధికారం కట్టబెడుతూ ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు.
అనంతరం కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాం□ధీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతోపాటు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు సహా పార్టీ ఎంపీలు, నేతలతో ఖర్గే విస్తృతంగా సంప్రదింపులు జరిపారని పేర్కొన్నారు. సీఎల్పీ నాయకుడిగా సతీశన్‌ను నియమిస్తూ తుది నిర్ణయం తీసుకున్నట్లు దీపాదాస్ మున్షీ స్పష్టంచేశారు. పార్టీలో తీవ్రస్థాయిలో విభేదాలు తలెత్తినట్లు వస్తున్న వార్తలను ఆమె ఖండించారు. పార్టీ మొత్తం ఐక్యంగా ఉందని తేల్చిచెప్పారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో 140 స్థానాలకు గాను కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ 102 స్థానాలు గెల్చుకున్న సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి పదవి కోసం కె.సి.వేణుగోపాల్, సతీశన్, రమేశ్ చెన్నితాల పోటీపడ్డారు. పార్టీ అధిష్టానాన్ని ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నించారు. ఈ నెల 4న ఎన్నికల ఫలితాలు వెలువడగా, దాదాపు 10 రోజులపాటు ఢిల్లీలో చర్చలు జరిగాయి. కాంగ్రెస్ పెద్దలు ఎట్టకేలకు సతీశన్‌కే సీఎం పోస్టు అప్పగించాలని నిర్ణయానికి వచ్చారు. బుధవారం ఖర్గే, రాహుల్ గాంధీ 40 నిమిషాలపాటు ప్రత్యేకంగా చర్చించుకున్నారు. గురువారం తుది నిర్ణయం వెలువడింది. తనను సీఎంగా ఎంపిక చేసినందుకు కాంగ్రెస్ హైకమాండ్‌కు సతీశన్ కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ తనకు అతిపెద్ద బాధ్యత అప్పగించిందని అన్నారు. కేరళ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తామని, వారి జీవన ప్రమాణాలు పెంచడానికి కృషి చేస్తామని ప్రకటించారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. కేరళ ప్రజలు పదేళ్ల వామపక్ష పాలనను అంతం చేశారని, ఎన్నో ఆశలతో తమకు అధికారం అప్పగించారని పేర్కొన్నారు. నూతన కేరళను సృష్టించడానికి, నూతన యుగాన్ని ప్రారంభించడానికి అంకితభావంతో పని చేస్తామని వెల్లడించారు.
కాంగ్రెస్ అధిష్టానం మద్దతు కె.సి.వేణుగోపాల్‌కు ఉన్నప్పటికీ సీఎంగా సతీశన్‌ను ఎంపిక చేయడం వెనుక ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) ఒత్తిడి ఉన్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్‌లో ప్రధాన భాగస్వామి అయిన ఐయూఎంఎల్ అసెంబ్లీ ఎన్నికల్లో 22 సీట్లు గెల్చుకుంది. మూడో అతిపెద్ద పార్టీగా అవతరించింది. సీఎం పదవిని సతీశన్‌ను కట్టబెట్టాలని ఆ పార్టీ కాంగ్రెస్ పెద్దలపై గట్టిగా ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. అసెంబ్లీలో కాంగ్రెస్‌కు సొంతంగా స్పష్టమైన మెజార్టీ లేని నేపథ్యంలో మిత్రపక్షమైన ఐయూఎంఎల్ ఒత్తిడికి అధిష్టానం తలొగ్గింది. మరోవైపు మెజార్టీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కె.సి.వేణుగోపాల్‌కు అండగా నిలిచారు. కానీ, క్షేత్రస్థాయిలో నేతలు, కార్యకర్తలు సతీశన్‌కే జై కొట్టారు. క్యాడర్‌పై బలమైన పట్టుండడం ఆయనకు అనుకూలంగా మారింది. ఇవన్నీ గుర్తించిన అధిష్టానం సతీశన్‌ను సీఎంగా ఎంపిక చేయక తప్పలేదు. సతీశన్ సహా కాంగ్రెస్ నేతలు గురువారం కేరళ గవర్నర్ ఆర్.వి.ఆర్లేకర్‌ను కలిశారు. ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మెజార్టీ ఎమ్మెల్యేల మద్దతు లేఖలను గవర్నర్‌కు అందజేశారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటూ గవర్నర్ ఆహ్వానించినట్లు సమాచారం.
ఈ నెల 18న సతీశన్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. వి.డి.సతీశన్..ప్రభుత్వంపై పదునైన విమర్శలు చేస్తూనే, ప్రశాంతమైన శైలితో ప్రజలకు అందుబాటులో ఉండే నేత.కేరళ రాజకీయాల్లో దూకుడుగల ప్రతిపక్ష నేతగా ప్రతిష్టను పెంచుకున్నారు. 2021లో ఓటమి తర్వాత దశాబ్దకాలంగా పార్టీ పునరుజ్జీవనానికి కృషి చేశారు. విద్యార్థి రాజకీయాల నుంచి ఉద్భవించి, కేరళలోని అత్యంత బలమైన ప్రతిపక్ష నాయకులలో ఒకరిగా ఎదిగిన సతీశన్, తన రాజకీయ వ్యూహంతో ఆచరణాత్మక రాజకీయవేత్తగా గుర్తింపు సంపాదించుకున్నారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా ప్రభుత్వ అవినీతి ఆరోపణలు, శాంతిభద్రతల సమస్యలు, రాష్ట్ర ఆర్థిక ఇబ్బందులపై ప్రధానంగా దృష్టి సారించారు. పినరయి విజయన్‌పై నేరుగా విమర్శలు గుప్పించారు. క్రమశిక్షణ కలిగిన నేతగా పేరుతెచ్చుకున్న సతీశన్.. గతంలో మంత్రిగా పనిచేసిన అనుభవం కూడా లేకపోయినప్పటికీ, మీడియా వ్యవహారాలలో నేర్పరి. ఆయన శైలి.. వర్గపోరాటాలతో సతమతమవుతున్న పార్టీలో కొందరు సీనియర్ నాయకులను కలవరపెట్టింది. యువతను కాంగ్రెస్ వైపు తీసుకురావడంలో కీలకపాత్ర పోషించారు. దిగ్గజ నాయకులైన కె. కరుణాకరన్, ఎ.కె.ఆంటోనీ, ఊమెన్ చాందీల తర్వాత కాంగ్రెస్‌లో ప్రజలను ఆకర్షించే నాయకుడిగా ఎదిగారు. అంతేకాదు, అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది రోజుల ముందు, కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమిని అధికారంలోకి తీసుకురాలేకపోతే రాజకీయ అజ్ఞాత వాసం చేస్తానని సంచలనాత్మక ప్రతిజ్ఞ చేశారు.
అంతేకాదు, యూడీఎఫ్‌కు 100కు పైగా సీట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. అది ఆయన ఆత్మ విశ్వాసానికి సంబంధించిన ఒక ధైర్యమైన ప్రకటన. సతీశన్ క్షేత్రస్థాయి విధానం, స్థానిక సమస్యలపై నిరంతర దృష్టి, పార్టీ వ్యవస్థను, ఓటర్ల విశ్వాసాన్ని పునరుద్ధరించడంలో తోడ్పడ్డాయి. ఆయన తండ్రి కె.దామోదర మీనన్, తల్లి వి.విలాసిని అమ్మ. ఎర్నాకులంలోని సేక్రెడ్ హార్ట్ కాలేజీలో డిగ్రీ చేశారు. రాజగిరి కాలేజ్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లో సోషల్ వర్క్ మాస్టర్స్ చదివారు. రాజకీయంలోకి రాకముందు ఆయన కేరళ హైకోర్టులో దాదాపు పదేళ్ల పాటు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. ఆయన భార్య ఆర్. లక్ష్మీప్రియ. వారికి ఉన్నిమాయ అనే ఒక కుమార్తె ఉంది. సతీశన్ రాజకీయ ప్రస్థానం విద్యార్థిగానే మొదలైంది. కాంగ్రెస్ విద్యార్థి విభాగమైన కేఎస్‌యూ (కేరళ స్టూడెంట్స్ యూనియన్) ద్వారా గుర్తింపు తెచ్చుకున్నారు. నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ) జాతీయ కార్యదర్శిగానూ పనిచేశారు.

ఫార్ములా-ఈ రేస్ కేసులో

కేటీఆర్‌కు నోటీసులు

ఈకబురు, సిటీ కోర్టులు, (హైదరాబాద్): ఫార్ములా-ఈ రేస్ కేసులో మాజీమంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నాంపల్లిలోని ఏసీబీ కోర్టు నోటీసులు జారీ చేసింది. ఏసీబీ అధికారులు దాఖలు చేసిన చార్జిషిట్‌ను పరిగణనలోకి తీసుకున్న కోర్టు కేటీఆర్ (ఏ-1)తో పాటు సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్ (ఏ-2), హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్‌రెడ్డి (ఏ-3)కి గురువారం నోటీసులు జారీ చేసింది. జూలై 31న కోర్టులో హాజరుకావాలని తెలిపింది. స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వరరావు (ఏ-4), యూకేకు చెందిన ఎఫ్ఈఓ సంస్థ (ఏ-5)లను కూడా ఏసీబీ ఈ కేసులో నిందితులుగా చేర్చింది. హెచ్ఎండీఏకు చెందిన రూ.55 కోట్లకు పైగా నిధులను విదేశీ సంస్థలకు నిందితులు మళ్లించినట్లు ఏసీబీ అభియోగాలు మోపింది. ఆర్థిక లావాదేవీలు, తదితరాలకు సంబంధించి దాదాపు వెయ్యికి పైగా పత్రాలను కోర్టుకు సమర్పించింది. ఈ మేరకు చార్జిషిట్‌ను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం పత్రాల పరిశీలన అనంతరం విచారణకు స్వీకరించనుంది.
రూ. 54.89 కోట్ల మళ్లింపు ఆరోపణలు
కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గత గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, అర్వింద్‌కుమార్ ప్రాసిక్యూషన్‌కు కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2022 ఫిబ్రవరిలో హుస్సేన్‌సాగర్ వద్ద ఫార్ములా-ఈ కార్ రేస్ పోటీలు నిర్వహించారు. ఆ సమయంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా నిబంధనలు ఉల్లంఘించి హెచ్ఎండీఏకు చెందిన రూ. 54.89 కోట్లను విదేశీ కంపెనీ ఖాతాల్లోకి మళ్లించారన్నది ఈ కేసులో ప్రధాన ఆరోపణ. కాగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఈ నిధుల విషయంలో ఎంఏయూడీ ముఖ్య కార్యదర్శి దానకిషోర్ 2024 డిసెంబర్ 18న ఏసీబీకి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా డిసెంబర్ 19న ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఇప్పటికే కేటీఆర్ తదితరులు విచారించింది.

సీఎం రేవంత్ కాన్వాయ్

వాహనాల కుదింపు!

సీఎం వాహనశ్రేణి మూడుకు, మంత్రుల వాహనాలు రెండుకు తగ్గించే అవకాశం
ఈకబురు, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాన్వాయ్ వాహనాల సంఖ్యను తగ్గిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. సీఎంతో పాటు ఇతర మంత్రుల వాహనాల సంఖ్యలోనూ తగ్గింపు చేసినట్లు తెలిసింది. సీఎం కాన్వాయ్‌లో ప్రస్తుతం 9 వాహనాలు ఉండగా ఆ సంఖ్యను మూడుకు తగ్గించినట్లుగా తెలిసింది. ఇప్పటికే ఇందుకు సంబంధించి భద్రతాధికారులు ట్రయల్ రన్ కూడా నిర్వహించారు. ఈ ట్రయల్ రన్‌లో భాగంగా గురువారం తన క్యాంపు ఆఫీసు నుంచి ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీకి మూడు వాహనాల కాన్వాయ్‌లోనే వెళ్లారు. అయితే, దీనిపై తుది నిర్ణయం ఇంకా జరగలేదని, నేడో, రేపో పూర్తి స్థాయిలో అమల్లోకి వస్తుందని సీఎంవో వర్గాల ద్వారా తెలిసింది. అదేవిధంగా కేబినెట్ మంత్రుల కాన్వాయ్ లోనూ పైలట్ వాహనాలను తొలగించనున్నట్లుగా సమాచారం. దీంతో మంత్రుల వాహనాల సంఖ్య రెండుకు తగ్గనుంది.
ఇరాన్-అమెరికా యుద్ధం నేపథ్యంలో దేశంలోనూ పెట్రోల్, డీజిల్ వినియోగం తగ్గించేందుకు కేంద్రం పలు చర్యలు చేపడుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే సీఎం రేవంత్ కూడా తన కాన్వాయ్ వాహనాలను కుదించుకోవాలనే నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. ఈ మేరకు భద్రతా వ్యవహారాలను చూసే పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

మోదీతో రష్యా మంత్రి లావ్రోవ్ భేటీ

ఈకబురు,న్యూఢిల్లీ: రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ గురువారం ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఉక్రెయిన్, పశ్చిమాసియా పరిణామాలతోపాటు పరస్పర ప్రయోజనాలతో ముడిపడి ఉన్న వివిధ ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. వివాదాలు, సంఘర్షణల పరిష్కారానికి సంప్రదింపులు, దౌత్య మార్గాలకే భారత్ స్థిరంగా కట్టుబడి ఉందని మోదీ ఈ సందర్భంగా పేర్కొన్నారు.
లావ్రోవ్‌ను సందంగా ఉందంటూ మోదీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. భారత్, రష్యా మధ్య ప్రత్యేక, విశిష్ట వ్యూహాత్మక భాగస్వామ్యంలోని వివిధ అంశాల పురోగతిపై తాజా సమాచారం అందించినందుకు ఆయనకు ధన్యవాదాలు తెలియజేశానని వెల్లడించారు. రష్యా అధినేత పుతిన్‌కు తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేయాలని లావ్రోవ్‌ను మోదీ కోరారు.

మోదీని కలిసిన 'బ్రిక్స్'విదేశాంగ మంత్రులు

బ్రిక్స్ దేశాల విదేశాంగ మంత్రులు ప్రధాని మోదీని కలిశారు. ఆయన వారికి ఆతిథ్యం ఇచ్చారు. రష్యా మంత్రి సెర్గీ లావ్రోవ్, ఇరాన్ మంత్రి అబ్బాస్ అరాగ్చీ, బ్రెజిల్ మంత్రి మౌరో, ఇండోనేషియా మంత్రి సుగియోనో, దక్షిణాఫ్రికా మంత్రి రోనాల్డ్ లామోలా ఉమ్మడిగా మోదీతో సమావేశమయ్యారు. మరోవైపు బ్రిక్స్‌దేశాల విదేశాంగ మంత్రుల రెండు రోజుల సదస్సు గురువారం ప్రారంభమైంది.

సుంకం పెంచితే.. బంగారం కొనడం తగ్గుతుందా?

బంగారంపై సుంకాన్ని రెట్టింపునకు పెంచడం వల్ల, గిరాకీ తగ్గుతుందా? వాణిజ్య లోటు అదుపులోకి వస్తుందా? విదేశీ మారకపు ద్రవ్యాన్ని కొంతమేర కాపాడుకోగలమా.. అనే సందేహాన్ని పరిశ్రమ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. బంగారాన్ని లోహం రూపంలో పలు దేశాల కేంద్రబ్యాంకులు భారీగా నిల్వ ఉంచుకుంటుంటే, మనదేశంలో మాత్రం ప్రజలే అధికంగా ఆభరణాల కోసం కొనుగోలు చేస్తున్నారు. పలు దేశాల్లో ప్రతిఫలం కోసమే ఎక్కువగా బంగారంపై పెట్టుబడులు పెడుతుంటారు. ఇటీవలి సంవత్సరాల్లో ధర బాగా పెరుగుతున్నందున, సంపద వృద్ధి కోసమూ మనదేశంలోనూ బంగారం బిస్కెట్లు, నాణేలు కొనడం అధికమవుతోంది. పసిడి ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ (ఈటీఎఫ్)ల్లోనూ పెట్టుబడులు పెడుతున్నారు. ఇప్పుడు వీటిపై ప్రభావం ఎలా ఉంటుందో పరిశీలించాలి.

ధరల ఆధారంగానే పెట్టుబడుల గిరాకీ

గతంతో పోలిస్తే, దేశీయంగా బంగారంపై పెట్టుబడులు పెరుగుతున్నాయని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) ఇటీవలి నివేదికలో పేర్కొంది. ధర బాగా పెరుగుతున్నందునే బంగారం బిస్కెట్లు, నాణేలు, పసిడి ఈటీఎఫ్‌లు, డిజిటల్ గోల్డ్‌పై పెట్టుబడులు పెట్టే వారి సంఖ్య అధికమవుతోంది. అంతర్జాతీయంగా ధర పెరుగుతుంటే, ఇకపై కూడా వీటిపై పెట్టుబడులు కొనసాగుతాయని.. పన్ను భారం పెరిగినా ప్రభావం ఉండదని అంచనా వేస్తున్నారు. అందువల్ల గిరాకీపై పెద్దగా ప్రతికూల ప్రభావం ఉండకపోవచ్చంటున్నారు. ఎగుమతుల కోసం సుంకం లేకుండా తెప్పించే బంగారానికి, కిలోకు రూ.2830 లక్షల బ్యాంక్ గ్యారెంటీలను సమకూర్చుకోవాల్సి వస్తుందని, ఇది చిన్న సంస్థలకు ఇబ్బంది కరమని జెమ్స్ అండ్ జువెలరీ ఎగుమతుల ప్రోత్సాహక మండలి పేర్కొంది.

2019 నుంచి దిగుమతులు తగ్గలేదు

మనదేశం 2019 నుంచి కూడా ఏటా 700800 టన్నుల బంగారాన్ని దిగుమతి చేసుకుంటూనే ఉంది. ఈ సమయంలో పసిడి ధర గణనీయంగా పెరిగినా కూడా, గిరాకీకొనుగోళ్లలో మార్పు రాలేదు. తాజా సుంకాల వల్ల పసిడివెండి ధరలు గతం కంటే 10% వరకు భారమవుతున్నాయి. అంతర్జాతీయంగా ధర పెరిగితే, ఇది మరింత పెరుగుతుంది. ఈ నేపథ్యంలో, ఆభరణాల గిరాకీపై 1015% ప్రభావం పడుతుందని వ్యాపార సంఘాలు అంచనా వేస్తున్నాయి. అంటే దేశ చెల్లింపుల భారం 1015 బిలియన్ డాలర్లు తగ్గొచ్చని భావిస్తున్నారు.

అనధికారిక అమ్మకాలు పెరుగుతాయ్

పసిడిపై దిగుమతి సుంకం అధికంగా ఉన్నందునే, స్మగ్లింగ్ ఎక్కువగా జరుగుతోందని.. బిల్లు లేకుండా దేశీయంగా వ్యాపారం జరుగుతున్నందున, ఆభరణాల స్వచ్ఛత రీత్యా కొనుగోలుదార్లు మోసపోతున్నారనే భావనతో 202425 బడ్జెట్‌లో సుంకాన్ని 15% నుంచి 6 శాతానికి తగ్గించారు. ఇప్పుడు మళ్లీ 6% నుంచి 15 శాతానికి పెంచారు. 'ఇప్పుడు కూడా తక్కువ ధరకు ఆభరణాలు విక్రయిస్తామంటే, బిల్లు లేకుండా కొనుగోలు చేద్దామనుకునేవారు ఉంటారు. మనదేశంలో సహజంగా 22 క్యారెట్ల (916 స్వచ్ఛత) ఆభరణాలనే విక్రయిస్తారు. ఈ స్వచ్ఛత తక్కువగా ఉన్నా, బిల్లు లేకుండా కొన్నప్పుడు, సదరు వ్యాపారులను ప్రశ్నించే అవకాశం వినియోగదారులకు ఉండదు. కానీ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా సామాన్యులే ఇలాంటి కొనుగోళ్లకు ముందుకు వస్తుంటారు' అని విశ్లేషిస్తున్నారు.

స్మగ్లింగ్ ఆపేందుకు నిశిత పరిశీలన

విలువైన లోహాలపై సుంకాల భారం రెట్టింపైనందున, దేశంలోకి దొంగచాటుగా తెచ్చేందుకు (స్మగ్లింగ్) ప్రయత్నించేవారి సంఖ్య పెరగొచ్చని భావిస్తున్నారు. ఇలాంటివి నిరోధించేందుకు రెవెన్యూ ఇంటెలిజెన్స్, కస్టమ్స్ అధికారులు తమ నిఘాను మరింత పెంచనున్నారు. సముద్ర తీరాలున్న మహారాష్ట్ర, తమిళనాడు, గుజరాత్, పశ్చిమబెంగాల్‌లో స్మగ్లింగ్ కార్యకలాపాలు ఎక్కువగా జరుగుతుంటాయని అధికారులు చెబుతున్నారు. కేరళ విమానాశ్రయాలోనూ అధికంగానే పసిడి పట్టుబడుతూ ఉంటోంది. పొరుగు దేశాలతో భౌగోళికంగా సరిహద్దులు పంచుకునే అస్సోం, మణిపూర్, మిజోరం ప్రాంతాలపైనా నిఘా అధికం చేస్తున్నారు.

దుబాయ్ నుంచి దిగుమతులు పెరగొచ్చు: జీటీఆర్ఐ

'యూఏఈతో మనదేశానికి ఉన్న ఆర్థిక ఒప్పందాల ఫలితంగా, ఇతర దేశాల కంటే 1% తక్కువ సుంకంతో దుబాయ్ నుంచి బంగారం దిగుమతి చేసుకునే వీలుంది. 2022లో 120 టన్నుల బంగారం దుబాయి నుంచి రాగా, 2027కు ఇది 200 టన్నులకు చేరొచ్చని' పరిశోధనా సంస్థ జీటీఆర్ఐ అంచనా వేస్తోంది. బంగారం ధర బాగా పెరిగినప్పుడు, 1% సుంకం కూడా ప్రభావం చూపుతుందన్నది సంస్థ విశ్లేషణ. 2022 నుంచి పదేళ్ల వ్యవధిలో వెండిపై దిగుమతి సుంకాన్ని 10% నుంచి సున్నాకు చేరుస్తామని యూఏఈతో మనదేశం ఒప్పందం చేసుకోవడం గమనార్హం.

హెచ్‌పీసీఎల్ రికార్డు లాభం

హిందుస్థాన్ పెట్రోలియమ్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్), మార్చి త్రైమాసికానికి, 2025-26 పూర్తి ఆర్థిక సంవత్సరానికి రికార్డు లాభాన్ని ప్రకటించింది. బలమైన మార్కెటింగ్, రిఫైనింగ్ మార్జిన్లు ఇందుకు తోడ్పడ్డాయి. జనవరి మార్చిలో హెచ్‌పీసీఎల్ స్టాండలోన్ నికర లాభం రూ.4,901.50 కోట్లుగా నమోదైంది 2024-25 ఇదే కాల లాభం రూ.3,354.98 కోట్ల కంటే ఇది 46% అధికం. పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావంతో, మార్చిలో అంతర్జాతీయంగా ముడి చమురు ధర బాగా పెరిగినా.. దేశీయంగా పెట్రోలు, డీజిల్ రిటెయిల్ ధరలు సవరించనందున ఇతర ప్రభుత్వ రంగ చమురు విక్రయ సంస్థలతో పాటు హెచ్‌పీసీఎల్ కూడా భారీగా నష్టపోయింది. అయినా జనవరి మార్చిలో రికార్డు లాభాన్ని సంస్థ నమోదు చేయడం గమనార్హం. అయితే ప్రస్తుత త్రైమాసికం (ఏప్రిల్ జూన్) కష్టంగానే ఉండొచ్చని, సంస్థ నష్టాలను నమోదు చేసే అవకాశం ఉందని హెచ్‌పీసీఎల్ ఛైర్మన్, ఎండీ వికాస్ కౌశల్ తెలిపారు. సమీక్షిస్తున్న త్రైమాసికంలో బ్యారెల్ ముడి చమురును ఇంధనంగా మార్చడం ద్వారా 8.79 డాలర్లను సంస్థ ఆర్జించింది. 2024-25 ఇదే కాలంలో ఇది 5.74 డాలర్లుగా ఉంది. 2025-26లో రెట్టింపునకు పైగా లాభం: 2025-26 ఆర్థిక సంవత్సరంలో హెచ్‌పీసీఎల్ నికర లాభం రూ.17,175.23 కోట్లుగా నమోదైంది. 2024-25 లాభం రూ.7,271.32 కోట్లతో పోలిస్తే ఇది రెట్టింపునకు పైగా అధికం. 2023-24 ఆర్థిక సంవత్సరంలో నమోదైన రూ.14,694 కోట్లకు మించి, 2025-26లో లాభం నమోదుకావడం గమనార్హం. 2025-26లో 26.04 మిలియన్ టన్నుల ముడి చమురును సంస్థ శుద్ధి చేసింది. కంపెనీ చరిత్రలో ఇదే ఇప్పటివరకు అత్యధికం. సంస్థ విక్రయాలు 3.3% పెరిగి 51.45 మిలియన్ టన్నులుగా నమోదయ్యాయి. రూ.10 ముఖ విలువ గల ఒక్కో షేరుపై రూ.19.25ను తుది డివిడెండుగా డైరక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

జియో ప్లాట్‌ఫామ్స్ ఎండీగా ఆకాశ్ అంబానీ

దిల్లీ: రిలయన్స్‌కు చెందిన డిజిటల్ సేవల సంస్థ జియో ప్లాట్‌ఫామ్స్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఆకాశ్ అంబానీ నియమితులయ్యారు. ఏప్రిల్ 9 నుంచి ఈ నియామకం అమల్లోకి వచ్చినట్లు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. ఐదేళ్ల కాలం పాటు ఆయన ఆ పదవిలో కొనసాగుతారని మే 7న సమర్పించిన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓకు సన్నద్ధమవుతున్న వేళ ఈ నియామకం జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఏడాది మే నెలాఖరున లేదా జూన్‌లో ఐపీఓకు సంబంధించి ముసాయిదా పత్రాలను సెబీకి సమర్పించే అవకాశం ఉంది. జియో ప్లాట్‌ఫామ్ టెలికాం విభాగమైన రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ బోర్డులో 2014 అక్టోబర్ నుంచి ఆకాశ్ అంబానీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. 2022 జూన్‌లో ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆయన నేతృత్వంలో జియో 2016లోనే కేవలం ఆరు నెలల వ్యవధిలో 10 కోట్ల మంది సబ్‌స్క్రైబర్లను సొంతం చేసుకుంది. 2026 ఆర్థిక సంవత్సరానికి రూ.30వేల కోట్ల నికర లాభాన్ని రూ.1.46 లక్షల కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది.

లాభాల్లో ముగిసిన దేశీయ మార్కెట్ సూచీలు



దేశీయమార్కెట్లు గురువారం భారీ లాభాల్లో ముగిశాయి. కనిష్ఠాల వద్ద కొనుగోళ్లు, అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల సంకేతాలతో మన సూచీలు లాభాల్లో కదలాడాయి. బ్యాంక్, ఫార్మా, లోహ రంగ స్టాక్స్ రాణించడంతో నేటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 800 పాయింట్ల వరకు పెరిగింది. సెన్సెక్స్ ఉదయం 74,947 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ఒక దశలో 75,681 గరిష్ఠానికి చేరింది. చివరకు 789 పాయింట్ల లాభంతో 75,398 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 277 పాయింట్లు పెరిగి, 23,689 వద్ద ముగిసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.73 వద్ద సెటిల్ అయింది. నిఫ్టీ సూచీలో అదానీ ఎంటర్‌ప్రైజెస్, సిప్లా, భారతీ ఎయిర్‌టెల్, ఎటర్నల్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ లాభాల్లో కదలాడాయి. ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, కోల్ ఇండియా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీఎసీఎస్ స్టాక్స్ నష్టపోయాయి. గురువారం ఆసియా మార్కెట్లు జపాన్ నిక్కీ, దక్షిణ కొరియా కొస్పి, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ సూచీలు లాభాల్లో ట్రేడయ్యాయి. అలాగే అమెరికాచైనా మధ్య చర్చలతో సానుకూల ఫలితాలు వస్తాయని మదుపర్లు ఆశిస్తున్నారు. చమురు ధరలు ఇప్పటికీ భగ్గుమనే అంటున్నా.. వారు ఈ చర్చలపైనే ఆశలు పెట్టుకున్నారు. టెలికాం ఆపరేటర్ భారతీ ఎయిర్‌టెల్ త్రైమాసిక ఫలితాలు సైతం నేటి లాభాలకు దోహదం చేశాయి.

టాటా మోటార్స్ డివిడెండ్ 200%

వాణిజ్య వాహన దిగ్గజం టాటా మోటార్స్, మార్చి త్రైమాసికంలో రూ.1,793 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 202425 ఇదే కాల లాభం రూ.1,340 కోట్లతో పోలిస్తే ఇది 33.8% అధికం. మొత్తం ఆదాయం సైతం రూ.21,863 కోట్ల నుంచి రూ.26,098 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలు మార్పు లేకుండా రూ.24,134 కోట్లుగా నిలిచాయి. సమీక్షిస్తున్న త్రైమాసికంలో వాహనాల టోకు అమ్మకాలు 1.32 లక్షలకు చేరుకున్నాయి. ఏడాది కిందటి జనవరిమార్చితో పోలిస్తే ఇవి 25% అధికం. కార్మిక చట్టాల ప్రభావం: పూర్తి ఆర్థిక సంవత్సరాని (202526)కి సంస్థ నికర లాభం రూ.3,030 కోట్లుగా నిలిచింది. 202425 లాభం రూ.3,195 కోట్లు. కొత్త కార్మిక చట్టాల అమలు, విభజన సంబంధిత వ్యయాల కారణంగా ఈసారి లాభం కాస్త తగ్గింది. టాటా మోటార్స్ కాస్తా టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్, టాటా మోటార్స్ (ఇది వాణిజ్య వాహన విభాగం)గా విడిపోయిన సంగతి తెలిసిందే. మొత్తం ఆదాయం మాత్రం రూ.58,217 కోట్ల నుంచి రూ.83,855 కోట్లకు చేరుకుంది. 202526లో వాహన టోకు అమ్మకాలు 202425తో పోలిస్తే 14% వృద్ధితో 4.28 లక్షలకు చేరుకున్నాయి. మందగమనం కనిపించొచ్చు: వాఘ్ 202526లో వాణిజ్య వాహన పరిశ్రమలో స్పష్టమైన మార్పు కనిపించిందని, కొవిడ్ పరిణామాలకు ముందు నాటి గరిష్ఠస్థాయులను అధిగమించాయని టాటా మోటార్స్ ఎండీ, సీఈఓ గిరీశ్ వాఘ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ అనిశ్చితులున్నా.. ప్రస్తుతం కూడా గిరాకీ సంబంధిత మూలాలు బలంగానే ఉన్నాయని, అయితే స్వల్పకాలంలో కాస్త మందగమనం కనిపించొచ్చన్నారు. రూ.2 ముఖ విలువ గల ఒక్కో షేరుపై రూ.4 (200%) తుది డివిడెండును బోర్డు డైరెక్టర్లు సిఫారసు చేశారు.

మెట్రోలో ప్రయాణించిన ఉబర్ సీఈఓ

...అద్భుతం అంటూ ప్రశంసలు

ఉబర్ సీఈఓ దారా ఖోస్రోషాహి ఇటీవల భారత్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన దిల్లీ మెట్రోలో ప్రయాణించారు. ఈ మెట్రో ప్రయాణం అద్భుతంగా ఉందంటూ ఆయన ఓ వీడియోను పంచుకున్నారు. ప్రస్తుతం ఇది నెట్టింట వైరల్ అవుతోంది. మోదీ జాకెట్ ధరించి.. ఒక సాధారణ ప్రయాణికుడిలా ఖోస్రోషాహి మెట్రోలో ప్రయాణించారు. 'లక్షలాది మంది ప్రజలు తమ రోజువారీ విధులకు వెళ్లేందుకు ఈ మెట్రోను ఉపయోగిస్తున్నారు' అని ఆయన అన్నారు. ఉబర్ యాప్ ద్వారా మెట్రో టికెట్ బుక్ చేసుకుని తన ప్రయాణాన్ని పూర్తి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రయాణం ఎంతో సాఫీగా, సమర్థవంతంగా సాగిందన్నారు. సాధారణ ప్రజలకు ఇది అందుబాటు ధరలో ఉందని, నమ్మదగినదని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా భవిష్యత్తులో ఉబర్ కేవలం కార్ రైడ్‌లకే పరిమితం కాదన్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటో, బస్సులు, మెట్రో వ్యవస్థలతో సహా అన్ని రవాణా మార్గాలను ఒకే ప్లాట్‌ఫామ్ పైకి తీసుకురావడమే తమ కంపెనీ లక్ష్యమన్నారు. భారత్‌లోని ప్రజా రవాణా వ్యవస్థలతో ఉబర్ తన భాగస్వామ్యాన్ని పెంచుకుంటుందన్నారు. దేశవ్యాప్తంగా తమ యాప్ ద్వారా కోటికి పైగా మెట్రో రైడ్‌లు బుక్ అయ్యాయన్నారు.

అమెరికా దిగ్గజ సంస్థల్లో లేఆఫ్‌లు..!

ప్రముఖ నెట్‌వర్కింగ్ సంస్థ 'సిస్కో'.. మరోవిడత ఉద్యోగ కోతలను ప్రకటించింది. ఈ త్రైమాసికంలో దాదాపు 4,000 మందిని తొలగించాలని యోచిస్తున్నట్లు తెలిపింది (Cisco layoffs). ఇది మొత్తం సిబ్బందిలో 5 శాతం కంటే తక్కువని పేర్కొంది. దీర్ఘకాలిక వృద్ధికి సంబంధించిన రంగాల వైపు పెట్టుబడులను మళ్లించే ప్రయత్నంలో భాగంగానే ఈ మార్పులు ఉన్నాయని సీఈవో చక్ రాబిన్స్ వివరించారు. మరోవైపు.. మూడో త్రైమాసికంలో 12 శాతం వృద్ధితో 15.8 బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరినట్లు కంపెనీ వెల్లడించింది. మైక్రోసాఫ్ట్ నేతృత్వంలోని లింక్డిన్ వందల సంఖ్యలో ఉద్యోగాలను తొలగించనుంది. మొత్తం ఉద్యోగుల్లో 5 శాతం అంటే దాదాపు 875 మందిని తొలగిస్తున్నట్లు తెలుస్తోంది. భవిష్యత్ అవసరాల దృష్ట్యా సంస్థాగతంగా నిలదొక్కుకునేందుకు పలు మార్పులు అమలుచేశామని ఈ అమెరికా సంస్థ ప్రతినిధి మీడియాకు వెల్లడించారు. మరోవైపు వాల్‌మార్ట్ 1000 మంది ఉద్యోగులను తొలగించనుంది లేక వేరే విభాగాలకు బదిలీ చేయనుంది. ఈ విషయాన్ని అమెరికాకు చెందిన ప్రముఖ సంస్థ వాల్‌మార్ట్ వెల్లడించింది. గ్లోబల్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రొడక్ట్ బృందాలను విలీనం చేయనుంది.

మోదీ పిలుపు వేళ..

వర్క్ ఫ్రమ్ హోమ్‌పై హర్షగోయెంకా పోస్ట్

పశ్చిమాసియా సంక్షోభం వేళ ప్రధాని మోదీ ప్రతిపాదించిన పలు పొదుపు చర్యలు పాటించేందుకు ఆర్‌పీజీ గ్రూప్ సిద్ధమైంది. దానిలో భాగంగా ఇప్పటికే ఉద్యోగులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆ సంస్థ ఛైర్మన్ హర్ష గోయెంకా (Harsh Goenka) వెల్లడించారు. ''ప్రధానమంత్రి (PM Modi) ఇచ్చిన పిలుపు తగ్గట్టుగా మా ఆర్‌పీజీ గ్రూప్ స్పందించింది. ఇతర కార్పొరేట్ సంస్థలు కూడా దానిని పాటిస్తాయని ఆశిస్తున్నాను'' అంటూ ఉద్యోగులకు జారీ చేసిన అంతర్గత అడ్వైజరీని గోయెంకా ఎక్స్ వేదికగా షేర్ చేశారు. విదేశీ ప్రయాణాలను కనిష్ఠస్థాయికి తగ్గించుకోవాలి..దేశీయ విమాన ప్రయాణాలను గణనీయంగా తగ్గించుకోవాలి, నగరాల మధ్య రాకపోకలను సాధ్యమైనంత నివారించుకోవాలి. ఇంటినుంచి పనిచేయగల (work from home) ఉద్యోగులను ఆ దిశగా ప్రోత్సహించాలి. నిత్యం జరిగే అంతర్గత సమీక్షలు, సమావేశాలను సాధ్యమైనంతగా వర్చువల్‌గా నిర్వహించాలి. ఉద్యోగులు కార్ పూలింగ్, ప్రజా రవాణా వైపు మొగ్గు చూపాలి. అలాగే ఎలక్ట్రిక్, హైబ్రిడ్ వాహనాలకు మారాలని గ్రూప్ కంపెనీలకు సూచించారు. అమెరికాఇరాన్ ఉద్రిక్తతలతో అంతర్జాతీయంగా ఇంధన సంక్షోభం నెలకొంది. చమురు ధరలు భగ్గుమంటున్నాయి. మన దిగుమతుల్లో చమురు, బంగారం కొనుగోలుకే అధికభాగం విదేశీ మారక నిల్వలను వినియోగిస్తున్నాం.. వీటిని జాగ్రత్తగా ఖర్చుచేయాల్సిన అవసరముంది. ఇప్పటికే మోదీ సూచనలతో ప్రభుత్వపరంగా జరిగే వ్యయాన్ని కట్టడి చేసేందుకు చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వాలు, సంస్థలు చర్యలు తీసుకునేందుకు ముందుకు వస్తున్నాయి. తమ సంస్థ ఉద్యోగులు తప్పకుండా వారంలో ఒకరోజు ఇంటినుంచి పనిచేయాలని షాదీ.కామ్ సీఈఓ అనుపమ్ మిత్తల్ ఇప్పటికే ప్రకటించారు.

మేం విడిపోతున్నాం

....నటి మౌనీరాయ్ ప్రకటన

నటి మౌనీరాయ్ (Mouni Roy), ఆమె భర్త సూరజ్ నంబియార్ (suraj nambiar) విడిపోతున్నట్టు ఇటీవల ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. తాము విడిపోతున్నట్టు ఇరువురు సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. పరస్పర అంగీకారంతోనే తాము సెపరేట్ అవుతున్నట్టు తెలిపారు. ఈ కష్ట సమయంలో ప్రైవసీ ఇస్తారని ఆశిస్తున్నామని, ఇద్దరిలో ఎవరి గురించీ అసత్య ప్రచారం చేయొద్దని విజ్ఞప్తి చేశారు.2022 జనవరిలో వీరి వివాహం జరిగింది. ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని రోజుల క్రితం ఒకరినొకరు అన్‌ఫాలో కావడంతో విడాకుల ప్రచారం ఊపందుకుంది. దీనిపై స్పందిస్తూ.. అవాస్తవాలను ప్రచారం చేయడం ఆపాలంటూ మౌనీరాయ్ బుధవారం పోస్టు పెట్టడం గమనార్హం. దుబాయ్‌లో వ్యాపారాలు నిర్వహించే సూరజ్ నంబియార్‌తో పెళ్లికి ముందే మౌనీరాయ్‌కు పరిచయం ఉంది. 'నాగిని' సీరియల్‌తో బుల్లితెర ప్రేక్షకులను ఆకట్టుకున్న మౌనీరాయ్.. 'గోల్డ్', 'బ్రహ్మాస్త్ర' తదితర చిత్రాల్లో వెండితెరపైనా సందడి చేశారు. పలు ప్రత్యేక గీతాలతోనూ అలరించారు.

సూర్య సినిమాకి మరో సమస్య.. నిర్మాత ఆందోళన

సూర్య 'కరుప్పు' (Karuppu) సినిమా మరో సమస్యలో చిక్కుకుంది. నేడు (మే 14) విడుదల కానున్న ఈ సినిమా షోలు రద్దయిన సంగతి తెలిసిందే. అయితే, ఉత్తరాదిలో కొన్ని థియేటర్లలో ఈ సినిమా ప్రదర్శిత మవడం చిత్ర బృందాన్ని షాక్‌కు గురిచేసింది. దీనిపై ప్రొడ్యూసర్ కౌన్సిల్‌తో ప్రెస్‌మీట్ అనంతరం నిర్మాత ఎస్.ఆర్. ప్రభు మీడియాతో మాట్లాడారు. తమకు తెలియకుండానే ముంబయి, పుణె లాంటి నగరాల్లో సినిమా ప్రదర్శితమైందని, మూవీ పైరసీ అయ్యే అవకాశం ఉందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఫైనాన్షియర్లతో చర్చించి రాత్రిలోగా విడుదల చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. నివార్య కారణాల వల్ల 'కరుప్పు' మార్నింగ్ షోలు ప్రదర్శించలేకపోతున్నట్లు నిర్మాణ సంస్థ డ్రీమ్ వారియర్స్ పిక్చర్స్ వెల్లడించింది. మ్యాట్నీ షోలైనా ఉంటాయేమోనన్న సినీ అభిమానులకు నిరాశే ఎదురైంది. ఇప్పటికే బుకింగ్స్ చేసుకున్న వారికి ఆయా ప్లాట్‌ఫామ్స్ మనీ రీఫండ్ ప్రక్రియ ప్రారంభించినట్టు సమాచారం. మరోవైపు, ఈ పరిస్థితులు చూసి తనకు కన్నీళ్లు ఆగడం లేదంటూ చిత్ర దర్శకుడు ఆర్జే బాలాజీ ఎమోషనల్ పోస్టు పెట్టారు. సాయంత్రంలోగా సమస్య పరిష్కారం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కానీ, సినిమా ఈరోజు ప్రదర్శితమయ్యే ఛాన్స్ చాలా తక్కువ అని తెలుస్తోంది.ఈ మూవీ 'వీరభద్రుడు' టైటిల్‌తో తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా షోలు రద్దు కావడంపై పలువురు కోలీవుడ్ ప్రముఖులు స్పందించారు. అడ్డంకులన్నీ తొలగిపోయి అతి త్వరలోనే 'కరుప్పు' థియేటర్లలోకి వస్తుందని ఆశిస్తున్నాంటూ హీరో ధనుష్ పోస్టు పెట్టారు. గత సినిమాలకు సంబంధించి ఫైనాన్సియర్లకు చెల్లించాల్సిన బకాయిలు సకాలంలో సర్దుబాటు కాకపోవడమే ప్రధాన కారణమని తెలుస్తోంది.

ఫ్యాషన్ రాజా..

విశాఖ, రుత్విక్, నాగ్ అశ్విన్, హను రాఘవపూడి

రుత్విక్ ప్రయాణాన్ని, సినిమాపై తనకున్న తపనని దగ్గరనుంచి చూశానని చిత్ర పరిశ్రమలో తనకి మంచి భవిష్యత్తు ఉందన్నారు ప్రముఖ దర్శకుడు నాగ్ అశ్విన్. ఆయనతోపాటు దర్శకులు హను రాఘవపూడి, వివేక్ ఆత్రేయ, నిర్మాత రవిశంకర్ ముఖ్య అతిథులుగా బుధవారం హైదరాబాద్‌లో 'రాజా ది రాజా' టీజర్ ఆవిష్కరణ వేడుక జరిగింది. రుత్విక్ కథానాయకుడిగా పరిచయం అవుతున్న చిత్రమిది. విశాఖ ధీమన్ కథానాయిక. అనిల్ బోయిడపు దర్శకత్వం వహించారు. కె.నిహారిక దాసరి నిర్మిస్తున్నారు. డాక్టర్ కావాలని తండ్రి కోరుకుంటే, ఫ్యాషన్ డిజైనర్ కావాలన్న కల కోసం ప్రయాణం చేసే యువకుడి కథతో ఈ చిత్రం రూపొందినట్టు టీజర్ స్పష్టం చేస్తోంది. ఈ సినిమా ఎప్పటికీ గుర్తుండిపోయే ప్రయాణమనీ, సీనియర్ నటులు మంజు భార్గవి, వీకే నరేశ్, సాయికుమార్ తదితరులతో కలిసి తెరను పంచుకోవడం గౌరవంగా భావిస్తున్నానన్నారు రుత్విక్. ఈ కార్యక్రమంలో మంజుభార్గవితోపాటు ఇతర చిత్రబృందం పాల్గొంది.

వెండి తెరకు మళ్లీ వెలుగులు..

కొవిడ్ సమయంలో ఓటీటీలకు విపరీతమైన ఆదరణ లభించడంతో బిగ్‌స్క్రీన్ ఒకింత కష్టాలను ఎదుర్కొంది. అయితే, ఇప్పుడు తాజా పరిస్థితులు చూస్తుంటే.. వెండితెరకు మళ్లీ వెలుగులు వచ్చినట్లే కన్పిస్తోంది. ఒకప్పుడు థియేటర్లను పక్కనపెట్టి నేరుగా ఓటీటీల్లో విడుదలైన సినిమాలు.. ఇప్పుడు మళ్లీ వెండితెర (Theaters) వైపు అడుగులు వేస్తున్నాయి. బాక్సాఫీస్ వసూళ్లు పెరుగుతుండటంతో పాటు ఓటీటీ సంస్థలు సినిమాల హక్కుల విషయంలో వచ్చే సమస్యల వల్ల సినీ పరిశ్రమ మళ్లీ 'థియేటర్ ఫస్ట్' అనే నినాదం వైపు మొగ్గు చూపుతోంది.ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చిన చిత్రాలు థియేటర్లలో విడుదలైన ఎనిమిది వారాల తర్వాతే ఓటీటీల్లోకి (OTT) వస్తున్నాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. కొవిడ్ అనంతరం కొన్ని చిత్రాలు విడుదలైన రెండు నుంచి నాలుగు వారాల్లోనే ఓటీటీల్లోకి వచ్చేవి. మరికొన్ని సినిమాలైతే ఏకంగా నేరుగా డిజిటల్ వేదికలకే పరిమితమయ్యాయి. కానీ, ప్రస్తుత పరిస్థితి పూర్తిగా మారిపోయిందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దేశంలోని ప్రముఖ మల్టీప్లెక్స్ సంస్థ పీవీఆర్ ఐనాక్స్ (PVR) మేనేజింగ్ డైరెక్టర్ అజయ్ బిజ్లీ తాజాగా ఈ అంశంపై మాట్లాడారు. ఓటీటీలు థియేటర్‌లకు ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాదన్నారు. "గతంతో పోలిస్తే ఇప్పుడు సినిమాలు ఆలస్యంగా ఓటీటీల్లోకి వస్తున్నాయి. బాక్సాఫీస్ వసూళ్లు సాధించిన సినిమాలకు ఓటీటీల్లో కూడా మంచి స్పందన లభిస్తోంది" అని తెలిపారు.ఫిక్కీ ఈవై నివేదిక ప్రకారం.. 2025లో దేశవ్యాప్తంగా మొత్తం 500 సినిమాలు ఓటీటీల్లో విడుదలయ్యాయి. వాటిలో నేరుగా ఓటీటీలో విడుదలైన చిత్రాల సంఖ్య గతంతో పోలిస్తే 60 నుంచి 30కి పడిపోయింది. అంటే 470 సినిమాలు ముందుగా థియేటర్లలో విడుదలై, తర్వాత కొన్ని వారాలకు ఓటీటీల్లోకి వచ్చాయి. గతేడాది బాక్సాఫీస్ వసూళ్లు కూడా గణనీయంగా పెరిగాయి. 2024లో రూ.11,400 కోట్లుగా ఉన్న వసూళ్లు.. 2025లో రూ.13,000 కోట్లకు చేరి కొత్త రికార్డు సృష్టించాయి. థియేటర్లలో బ్లాక్ బస్టర్ హిట్ అయిన చిత్రాలు ఓటీటీలోనూ ఆదరణ సొంతం చేసుకుంటున్నాయని నివేదికలు పేర్కొన్నాయి.మరోవైపు ఓటీటీ సంస్థలు కూడా సినిమా హక్కుల కొనుగోళ్లలో జాగ్రత్తలు వహిస్తూ.. రేటు విషయంలో కూడా నియంత్రణ పాటిస్తున్నాయి. డిస్నీప్లస్ హాట్‌స్టార్, జియో సినిమా విలీనంతో పోటీ తగ్గడం కూడా దీనికి కారణమైంది. దీంతో 2025లో ఓటీటీ ఆదాయం 7 శాతం తగ్గి రూ.2,900 కోట్లకు చేరిందని ఫిక్కీ ఈవై తన తాజా నివేదికలో వెల్లడించింది.

వ్యక్తిగతంగా మాట్లాడుతున్నారు.. 'పెద్ది'తో మాకు సంబంధం లేదు: TSFCC

సింగిల్ స్క్రీన్లలో పూర్తిస్థాయి పర్సంటేజీ విధానాన్ని తెలంగాణ ఎగ్జిబిటర్లు కోరుతుండగా.. అది కష్టమంటున్నారు నిర్మాతలు. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు చేసిన వ్యాఖ్యలు టాలీవుడ్‌లో హాట్‌టాపిక్‌గా మారాయి. ఈ పరిమాణాల నేపథ్యంలో తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎస్ఎఫ్‌సీసీ) గురువారం ప్రెస్‌మీట్ నిర్వహించింది. తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి శ్రీధర్, నిర్మాత సి.కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు శ్రీధర్ మాట్లాడుతూ.. ''తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో భాగంగానే మొన్న ఎగ్జిబిటర్ల ప్రెస్‌మీట్ జరిగింది. పర్సంటేజీ విధానం కోసం మేం 2008 నుంచి పోరాడుతున్నాం. గతేడాది కూడా అడగ్గా.. పెద్ద సినిమా 'హరిహర వీరమల్లు' విడుదల సమయంలో ఇలా చేయొద్దని చెప్పారు. రెండు నెలల్లో చర్చిద్దామన్నారు. నెలలు గడుస్తున్నా స్పందనలేదు. అందుకే మళ్లీ అడుగుతున్నాం. అటు తిప్పి ఇటు తిప్పి 'పెద్ది' సినిమా ప్రస్తావన తీసుకొచ్చారు. ఈ చిత్రంతో మాకు ఎలాంటి సంబంధం లేదు. కొందరు నిర్మాతలు వ్యక్తిగతంగా మాట్లాడుతున్నారు. చర్చలకు వారు ఎప్పుడూ పిలిచినా మేం సిద్ధమే. రేపు (మే 15) ఫిల్మ్ ఛాంబర్‌లో జరిగే సమావేశంలో నిర్ణయం తీసుకుంటాం'' అని తెలిపారు.''తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌లో రేపు (శుక్రవారం) జరగబోయే సమావేశంలో సమస్య పరిష్కారానికి తొలి అడుగు పడుతుంది. అన్నింటి కన్నా ముఖ్యంగా ప్రేక్షకుడికి సినిమాని ఎలా చేరువ చేయాలన్న దాని గురించి ఆలోచించాలి. నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లది ఒకే కుటుంబం. వ్యక్తిగత వ్యాఖ్యలు సరికాదు'' అని సి.కల్యాణ్ పేర్కొన్నారు.

'జన నాయగన్'పై విజయ్ దృష్టి.. కేన్స్ వెళ్లిన నిర్మాతకు పిలుపు!

చివరి నిమిషంలో విడుదల ఆగిపోయిన 'జన నాయగన్'కు లైన్ క్లియర్ చేసే పనిపై తమిళనాడు సీఎం, అగ్ర కథానాయకుడు విజయ్ దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. 'జన నాయగన్' (Jana Nayagan) ప్రస్తుతం రివైజింగ్ కమిటీ దగ్గర ఉన్న విషయం తెలిసిందే. దీని విడుదలకు మార్గం సుగమం చేసే దిశగా అడుగులు పడుతున్నట్లు కోలీవుడ్ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇందులోభాగంగానే ఫ్రాన్స్‌లో జరుగుతోన్న కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు వెళ్లిన నిర్మాతను విజయ్ చెన్నైకి రావాలని కోరినట్లు సమాచారం.విజయ్ (Vijay) చివరి చిత్రం కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే, సెన్సార్ సర్టిఫికెట్ రానందున విడుదల వాయిదా పడుతూ వచ్చింది. తాజాగా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన విజయ్.. ఈ అడ్డంకులను తొలగించి త్వరలోనే చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని భావిస్తున్నారట. ఈ పనుల కోసమే కేన్స్‌కు వెళ్లిన కేవీఎన్ బ్యానర్ నిర్మాత వెంకట్‌ను అక్కడినుంచి వెనక్కిరావాలని కోరారు. విజయ్ పిలుపుతో నిర్మాత తన పర్యటనను మధ్యలోనే ముగించుకుని చెన్నై బయల్దేరినట్లు తెలుస్తోంది. దీంతో త్వరలోనే 'జన నాయగన్' విడుదల తేదీపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. సీఎంగా ఒకవైపు సంచలన నిర్ణయాలు తీసుకుంటోన్న విజయ్.. తన ఆఖరి చిత్రాన్ని వీలైనంత త్వరగా విడుదల చేయాలని ప్రయత్నాలు చేయడంతో ఫ్యాన్స్ సంబరపడుతున్నారు. దీనిపై నిర్మాణ సంస్థ నుంచి అధికారిక ప్రకటన కోసం ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు.

కొచ్చిలో ఆ భయాన్ని జయించా : రష్మిక పోస్ట్

ప్రముఖ నటి రష్మిక తనలో ఉన్న అతిపెద్ద భయాన్ని అధిగమించినట్లు పేర్కొన్నారు. షూటింగ్ కోసం కొచ్చిలో ఉన్న ఆమె, ఎత్తులను చూసి భయపడే తన బలహీనతను ధైర్యంగా ఎదుర్కొన్నట్లు సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టారు. ఈ సందర్భంగా 'మైసా' షూటింగ్ అనుభవాలను పంచుకున్నారు.''కొచ్చిలో ఉన్న రోజులు ఎన్నో జ్ఞాపకాలను మిగిల్చాయి. అడవులు, కీటకాలు, జలపాతాలు, ట్రెక్కింగ్‌లు, వర్షాలు, వర్షాలు.. ఇలా ప్రతిదీ ఒక అనుభవం. ముఖ్యంగా ఎత్తులంటే నాకు చాలా భయం. ఇక్కడ ఆ భయాన్ని జయించాను. యాక్షన్ సీక్వెన్స్‌ల కోసం శిక్షణ తీసుకోవడం, మోకాళ్లకు గాయాలైనా పట్టువదలకుండా పోరాడటం కొత్త శక్తిని ఇచ్చాయి. ఉదయాన్నే అలారం మోగగానే నిద్ర లేవడం నుంచి, ఎంతో ఇష్టమైన పళం పూరీలు కడుపునిండా తినడం వరకు ప్రతి క్షణాన్ని ఆస్వాదించాను'' అని పేర్కొన్నారు. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో 'మైసా' తెరకెక్కుతోంది. ఈ చిత్రం కోసం రష్మిక డూప్ లేకుండా 80 అడుగుల ఎత్తు నుంచి దూకారని దర్శకుడు గతంలో తెలిపారు. ఆ సమయంలో ఆమె చేతులకు, కాళ్లకు గాయాలయ్యాయని.. అయినా విరామం తీసుకోకుండా షూటింగ్ చేశారని చెప్పారు.

గ్లోబల్ ట్రెండింగ్‌లో విరోష్ జోడీ.. ఒకవైపు రష్మిక పోస్ట్ వైరల్ అవుతుండగా తన భర్త విజయ్ దేవరకొండతో (Vijay Deverakonda) కలిసి చేసిన ఓ యాడ్ ఇప్పుడు గ్లోబల్ స్థాయిలో ట్రెండ్ అవుతోంది. విరోష్ జోడీకి (Virosh) ఏ రేంజ్‌లో అభిమానులు ఉన్నారో తెలిసిందే. వీరిద్దరూ పెళ్లి తర్వాత చేసిన ఓ వాణిజ్య ప్రకటనను ఇన్‌స్టాలో గతంలో అప్‌లోడ్ చేయగా.. అది తాజాగా సరికొత్త రికార్డు సృష్టించింది. ఇప్పటివరకూ దీనికి ఏకంగా 9.1 మిలియన్లకు పైగా లైక్స్ వచ్చాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఇన్‌స్టాలో అత్యధిక లైక్స్ సాధించిన రెండో ప్రకటనగా రికార్డును సొంతం చేసుకుంది. ఇక్కడ మరో ఆసక్తికర విషయం ఏమిటంటే.. ఈ జాబితాలో మొదటి స్థానంలో ఉన్నది కూడా ఈ జోడీనే.. గతంలో వీరిద్దరూ కలిసి నటించిన ఓ యాడ్ 11.5 మిలియన్లకు పైగా లైక్స్‌తో గ్లోబల్ రికార్డు నెలకొల్పింది. దానికి 104 మిలియన్ల వ్యూస్ వచ్చాయి. ప్రస్తుతం వీరిద్దరూ కలిసి 'రణబాలి'లో నటిస్తోన్న విషయం తెలిసిందే.

క్రీడాకారుడి పోరాటం..

దానివెనక 29 ఏళ్ల శ్రమ ఉంది' అంటున్నాడు ట్రాక్‌పైకి ఎక్కిన ఓ క్రీడాకారుడు. మైదానంలోనూ, బయట అతని పోరాటం ఎలా సాగిందో తెలియాలంటే 'గుర్తింపు' సినిమా చూడాల్సిందే. కేజీఆర్ కథానాయకుడిగా తెరకెక్కిన చిత్రమిది. జె.పి.తెన్ పతియాన్ దర్శకత్వం వహించారు. ఎస్.కె.ప్రశాంత్, అజిత్ భాస్కర్, అరుణ్ మురుగన్ నిర్మాతలు. ఈ సినిమా ట్రైలర్‌ని బుధవారం విడుదల చేశారు. దేశంలోని క్రీడావ్యవస్థ, రాజకీయ వ్యవస్థ, ప్రభుత్వ పనితీరు కారణంగా పేదలు క్రీడలకు ఎలా దూరమవుతున్నారనే ఇతివృత్తం ఆధారంగా రూపొందిన చిత్రమిది.

ఇండియా-ఎ జట్టులో వైభవ్

దిల్లీ: ఐపీఎల్‌లో వరుసగా రెండో సీజన్లోనూ అదరగొడుతున్న 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ.. టీమ్‌ఇండియా వైపుగా అడుగులు మొదలుపెట్టాడు. అతడికి ముందుగా సెలక్టర్లు ఇండియా-ఎ జట్టులో చోటిచ్చారు. శ్రీలంకలో జూన్ 9 నుంచి జరిగే ముక్కోణపు వన్డే సిరీస్‌లో బరిలోకి దిగే భారత్-ఎ జట్టుకు వైభవ్ ఎంపికయ్యాడు. ఇందులో ఆతిథ్య శ్రీలంక-ఎతో పాటు అఫ్గానిస్థాన్ 'ఎ' జట్టు కూడా పాల్గొంటుంది. హైదరాబాదీ బ్యాటర్ తిలక్ వర్మ సారథ్యం వహించే ఈ జట్టులో ఎక్కువమంది ఐపీఎల్ ఆటగాళ్లే చోటు దక్కించుకున్నారు. దంబుల్లాలో జరిగే ఈ సిరీస్ తర్వాత.. భారత్-ఎ జట్టు గాలెలో శ్రీలంక-ఎతో రెండు 4 రోజుల మ్యాచ్‌లు రెండు ఆడుతుంది. ఈ సిరీస్‌కు జట్టును తర్వాత ఎంపిక చేస్తారు.

ముక్కోణపు సిరీస్‌కు భారత్-ఎ జట్టు: తిలక్ వర్మ (కెప్టెన్), రియాన్ పరాగ్ (వైస్ కెప్టెన్), ప్రియాంశ్ ఆర్య, వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ బదోని, నిశాంత్ సింధు, హర్ష్ దూబె, సూర్యాంశ్ షెడ్జే, ప్రభ్‌సిమ్రన్ సింగ్ (వికెట్ కీపర్), కుమార్ కుశాగ్ర (వికెట్ కీపర్), విప్రాజ్ నిగమ్, యశ్ ఠాకూర్, యుధ్వీర్ సింగ్, అన్షుల్ కాంబోజ్, అర్షద్ ఖాన్.

పంజాబ్‌పై ముంబై ఘన విజయం

ఐపీఎల్‌లో ప్లేఆఫ్స్ రేసుకు దూరమైన జట్లు స్వేచ్ఛగా ఆడుతూ, ముందంజ వేసే అవకాశమున్న జట్లను దెబ్బ తీయడం ఎప్పుడూ జరిగేదే. గురువారం ముంబయి ఇండియన్స్ కూడా అదే పని చేసింది. ఎనిమిదో ఓటమితో ప్లేఆఫ్స్ కు దూరమైన ఆ జట్టు.. ధర్మశాలలో పంజాబ్ కింగ్స్‌ను మట్టికరిపించింది. లీగ్ ప్రథమార్ధంలో అజేయంగా సాగిపోతూ అలవోకగా ముందంజ వేసేలా కనిపించిన పంజాబ్.. వరుసగా అయిదో ఓటమితో ప్లేఆఫ్స్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. తిలక్ వర్మ, ర్యాన్ రికెల్టన్ మెరుపు ఇన్నింగ్స్‌లతో ముంబయికి విజయాన్నందించారు. ఐపీఎల్‌లో తొలిసారిగా కెప్టెన్‌గా వ్యవహరించిన జస్‌ప్రీత్ బుమ్రా.. శుభారంభం చేశాడు.

ఐపీఎల్ 19 పాయింట్ల పట్టికలో కింద ఉన్న జట్లు ఒక్కొక్కటిగా పైకి వస్తుంటే.. పైనున్న పంజాబ్ కిందికి దిగుతోంది. తొలి ఏడు మ్యాచ్‌ల్లో ఓటమే ఎరుగని ఆ జట్టు.. ఒక్కసారి ఓటమి చవిచూశాక మళ్లీ గెలుపు రుచి చూడలేకపోతోంది. ఆ జట్టు వరుసగా అయిదో ఓటమిని ఖాతాలో వేసుకుంది. గురువారం ముంబయి 6 వికెట్ల తేడాతో పంజాబ్‌ను ఓడించింది. తిలక్ వర్మ (75 నాటౌట్; 33 బంతుల్లో 6×4, 6×6), ర్యాన్ రికెల్టన్ (48; 23 బంతుల్లో 4×4, 4×6) మెరుపు ఇన్నింగ్స్‌లతో 201 పరుగుల లక్ష్యాన్ని ఎంఐ 19.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. పంజాబ్ బౌలర్లలో అజ్మతుల్లా (2/36) రాణించాడు. మొదట కింగ్స్ 8 వికెట్లకు 200 పరుగులు చేసింది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (57; 32 బంతుల్లో 6×4, 4×6), అజ్మతుల్లా (38; 17 బంతుల్లో 2×4, 4×6) సత్తా చాటారు. ముంబయి పేసర్ శార్దూల్ ఠాకూర్ (4/39) సూపర్ బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. 12 మ్యాచ్‌ల్లో 13 పాయింట్లతో ఉన్న పంజాబ్‌కు ఇప్పటికీ ఛాన్సున్నప్పటికీ.. ఆత్మవిశ్వాసం సన్నగిల్లిన ఆ జట్టు చివరి రెండు మ్యాచ్‌ల్లోనూ నెగ్గి ముందంజ వేయగలదా అన్నది సందేహం.

అతను మొదలెడితే.. ఇతను ముగించాడు: ఛేదనలో ముంబయికి అదిరే ఆరంభాన్నిచ్చాడు ఓపెనర్ రికెల్టన్. మరో ఓపెనర్ రోహిత్ శర్మ ఆచితూచి ఆడుతుంటే.. ఈ దక్షిణాఫ్రికా వికెట్ కీపర్ బ్యాటర్ మాత్రం చెలరేగిపోయాడు. కొత్త బంతితో అర్ష్‌దీప్ చక్కగా బౌలింగ్ చేసినా.. మిగతా పేసర్లు నిరాశపరిచారు. ముఖ్యంగా యాన్సెన్, బార్ట్‌లెట్ తేలిపోయారు. అజ్మతుల్లా బౌలింగ్‌లో సిక్సర్‌తో ఊపందుకున్న రికెల్టన్.. యాన్సెన్ వేసిన మూడో ఓవర్లో 4, 6, 4 బాదాడు. బార్ట్‌లెట్ 2 ఓవర్లలో కలిపి మూడు సిక్సర్లు, ఒక ఫోర్ సమర్పించుకోవడంతో 6 ఓవర్లకు ముంబయి 59/0తో పటిష్ఠ స్థితికి చేరుకుంది. అయితే అర్ధశతకం దిశగా దూసుకెళ్తున్న రికెల్టన్‌ను ఔట్ చేసిన అజ్మతుల్లా.. పంజాబ్‌కు బ్రేక్ ఇచ్చాడు. నమన్ ధీర్ (9), రోహిత్ శర్మ (25) వరుస ఓవర్లలో ఔటైపోవడంతో 10 ఓవర్లకు ముంబయి 89/3తో ఇబ్బందుల్లో పడింది. ఈ స్థితిలో తిలక్ వర్మ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఎక్కువ వేగంగా ఆడకపోయినా.. అతను ఇన్నింగ్స్‌కు స్థిరత్వం తీసుకొచ్చాడు. సాధించాల్సిన రన్‌రేట్ పెరిగిపోతుండడంతో 16వ ఓవర్లో తిలక్ బ్యాట్ ఝుళిపించాడు. చాహల్ బౌలింగ్‌లో సిక్స్, ఫోర్ కొట్టాడు. షెర్ఫానీ రూథర్‌ఫర్డ్ కూడా ఓ సిక్స్ అందుకోవడంతో ఈ ఓవర్లో 20 పరుగులొచ్చాయి. 4 ఓవర్లలో 52 పరుగులు చేయాల్సిన స్థితిలో అజ్మతుల్లా 17వ ఓవర్లో రూథర్‌ఫర్డ్ (20)ను ఔట్ చేయడమే కాక, 2 పరుగులే ఇచ్చి పంజాబ్‌కు మంచి అవకాశం కల్పించాడు. కానీ యాన్సెన్ వేసిన 18వ ఓవర్ ఆ జట్టు ఆశలు కోల్పోయేలా చేసింది. ఈ ఓవర్లో కళ్లు చెదిరే షాట్లు ఆడుతూ తిలక్ రెండు సిక్సర్లు, ఒక ఫోర్ బాదేయగా.. జాక్స్ (25 నాటౌట్; 10 బంతుల్లో 2×4, 2×6) కూడా ఒక ఫోర్ కొట్టడంతో మొత్తంగా 22 పరుగులు వచ్చాయి. బార్ట్‌లెట్ వేసిన చివరి ఓవర్లో 15 పరుగులు అవసరమవగా.. తొలి బంతికే జాక్స్ సిక్సర్ బాదాడు. 2వ బంతికి సింగిల్ రాగా.. మూడో బంతికి పరుగు రాలేదు. 4, 5 బంతులకు సిక్సర్లు బాదిన తిలక్ ముంబయిని గెలిపించాడు.

పంజాబ్ లేచి.. పడి.. లేచి..: మొదట టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన పంజాబ్.. 200 స్కోరు చేయడం అనూహ్యమే. ఇన్నింగ్స్‌ను మెరుగ్గా ఆరంభించి.. మధ్యలో తడబడి..

చివర్లో పుంజుకుని అనుకున్న దాని కంటే మెరుగైన స్కోరే చేసింది పంజాబ్. వరుస వైఫల్యాల నుంచి బయటపడుతూ ప్రభ్‌సిమ్రన్ సింగ్ అర్ధశతకం బాదడంతో పంజాబ్ ఇన్నింగ్స్‌కు బలమైన పునాది పడింది. అయితే ముంబయి ఫీల్డర్లు రెండు తేలికైన క్యాచ్‌లు వదిలేయడం అతడికి కలిసొచ్చింది. ఒక దశలో 23 బంతుల్లో 29 పరుగులే చేసిన ప్రభ్‌సిమ్రన్.. తర్వాతి 8 బంతుల్లో 4 సిక్సర్లు బాదేయడం విశేషం. ప్రియాంశ్ ఆర్య (22; 17 బంతుల్లో 4×4)తో తొలి వికెట్‌కు 50 పరుగులు జోడించిన అతను.. కూపర్ కనోలీ (21; 22 బంతుల్లో 2×4, 1×6) మరో అర్ధశతక భాగస్వామ్యం నెలకొల్పడంతో పంజాబ్ 108/1తో పటిష్ఠ స్థితికి చేరుకుంది. అయితే 12వ ఓవర్లో శార్దూల్ ఠాకూర్ మూడు బంతుల వ్యవధిలో ప్రభ్‌సిమ్రన్, శ్రేయస్ అయ్యర్ (4)లను ఔట్ చేసి పంజాబ్‌ను గట్టి దెబ్బ తీశాడు. కనోలీ, సూర్యాంశ్ షెడ్జే (8), శశాంక్ (2), యాన్సెన్ (2) కూడా పెవిలియన్‌కు క్యూ కట్టేయడంతో 16.2 ఓవర్లకు కింగ్స్ 140/7తో పతనం దిశగా సాగింది. కానీ అజ్మతుల్లా ధాటికి 18వ ఓవర్లో దీపక్ చాహర్ 19 పరుగులు సమర్పించుకోవడం.. విష్ణు వినోద్ (15 నాటౌట్), బార్ట్‌లెట్ (18 నాటౌట్) కలిసి బోష్ వేసిన 19వ ఓవర్లో 22 పరుగులు రాబట్టడంతో పంజాబ్ 200 చేరుకోగలిగింది.

స్కోరు వివరాలు

పంజాబ్ ఇన్నింగ్స్: ప్రియాంశ్ ఆర్య (బ) దీపక్ చాహర్ 22; ప్రభ్‌సిమ్రన్ (సి) బోష్ (బ) శార్దూల్ 57, కూపర్ కనోలీ (బ) బవా 21; శ్రేయస్ (బ) శార్దూల్ 4; సూర్యాంశ్ షెడ్జే (సి) బవా (బ) శార్దూల్ 8; శశాంక్ ఎల్బీ (బ) బోష్ 2; అజ్మతుల్లా (సి) జాక్స్ (బ) దీపక్ చాహర్ 38; యాన్సెన్ (బ) శార్దూల్ 2; విష్ణు వినోద్ నాటౌట్ 15; బార్ట్‌లెట్ నాటౌట్ 18; ఎక్స్‌ట్రాలు 13 మొత్తం: (20 ఓవర్లలో 8 వికెట్లకు) 200; వికెట్ల పతనం: 1-50, 2-107, 3-111, 4-111, 5-123, 6-135, 7-140, 8-166; బౌలింగ్: దీపక్ చాహర్ 4-0-36-2; బుమ్రా 4-0-35-0; శార్దూల్ ఠాకూర్ 4-0-39-4; కార్బిన్ బోష్ 4-0-42-1; రఘు శర్మ 2-0-22-0; విల్ జాక్స్ 1-0-9-0; రాజ్ బవా 1-0-11-1

ముంబయి ఇన్నింగ్స్: రోహిత్ (బ) చాహల్ 25; రికెల్టన్ (సి) ప్రియాంశ్ (బ) అజ్మతుల్లా 48; నమన్ ధీర్ (సి) అర్ష్‌దీప్ (బ) యాన్సెన్ 9; తిలక్ నాటౌట్ 75; రూథర్‌ఫర్డ్ (సి) బార్ట్‌లెట్ (బ) అజ్మతుల్లా 20; జాక్స్ నాటౌట్ 25; ఎక్స్‌ట్రాలు: 3, మొత్తం: (19.5 ఓవర్లలో 4 వికెట్లకు) 205; వికెట్ల పతనం: 1-61, 2-81, 3-88, 4-149; బౌలింగ్: అర్ష్‌దీప్ 4-0-29-0; అజ్మతుల్లా 4-0-36-2; యాన్సెన్ 4-0-55-1; బార్ట్‌లెట్ 3.5-0-53-1; చాహల్ 4-0-32-1

సీఎస్‌కే జట్టులోకి సౌతాఫ్రికా యువ సంచలనం

ఐపీఎల్ 2026 సీజన్‌లో ప్లే ఆఫ్స్ బెర్త్ దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్న చెన్నై సూపర్ కింగ్స్‌కు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ ఆల్‌రౌండర్ జేమీ ఓవర్టన్ గాయం కారణంగా టోర్నీ నుంచి తప్పుకొన్నాడు. కుడి తొడ గాయంతో బాధపడుతున్న ఓవర్టన్.. తదుపరి చికిత్స కోసం యూకేకు తిరుగు ప్రయాణమయ్యాడు.

ఈ విషయాన్ని సీఎస్‌కే మేనేజ్‌మెంట్ అధికారికంగా ధ్రువీకరించింది. అతడి స్థానంలో దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ డియన్ ఫారెస్టర్‌ను సీఎస్‌కే తమ జట్టులోకి తీసుకుంది. రూ.75 లక్షల కనీస ధరకు అతడితో చెన్నై సూపర్ కింగ్స్ ఒప్పందం కుదుర్చుకుంది.

"జేమీ ఓవర్టన్‌కు కుడి తొడకు గాయమైంది. అతడు తదుపరి చికిత్స కోసం యూకేకు తిరిగి వెళ్లిపోయాడు. ఓవర్టన్ లేకపోవడం జట్టు సమతుల్యతను దెబ్బతీస్తుంది. కానీ కొత్త ఆటగాళ్లు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుంటారని ఆశిస్తున్నాం" సీఎస్‌కే యాజమాన్యం ఓ ప్రకటనలో పేర్కొంది. కాగా ఓవర్టన్ దూరం కావడం సీఎస్‌కే నిజంగా భారీ షాక్ అనే చెప్పాలి. ఎందుకంటే ఓవర్టన్ ప్రస్తుతం అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. ఇప్పటివరకు ఆడిన 10 మ్యాచ్‌ల్లో 14 వికెట్లు తీసి జట్టులో అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా నిలిచారు.అటు బ్యాట్‌తోనూ లోయర్ ఆర్డర్‌లో కీలక పరుగులు చేస్తూ జట్టుకు కీలక ఆటగాడిగా నిలిచాడు. ఇక ఓవర్టన్ స్థానంలో జట్టులోకి వచ్చిన ఫారెస్టర్‌కు అద్భుతమైన ఆల్‌రౌండ్ స్కిల్స్ ఉన్నాయి. ఇటీవల ముగిసిన పాకిస్తాన్ సూపర్ లీగ్‌లో ఫారెస్టర్ అదరగొట్టాడు.

సీఎస్‌కే తమ తదుపరి మ్యాచ్‌లో మే 15న లక్నో సూపర్ జెయింట్స్‌తో తలపడనుంది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలో ఉన్న సీఎస్‌కేకు ప్లేఆఫ్స్ చేరాలంటే మిగిలిన మూడు మ్యాచ్‌లు అత్యంత కీలకం.

నిఖత్ ఔట్

దిల్లీ: స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్‌కు షాక్. సెలక్షన్ ట్రయల్స్‌లో ఆశ్చర్యకర ఓటమితో ఆమె 2026 కామన్వెల్త్, ఆసియా క్రీడలకు దూరమైంది. నిఖత్ గురువారం 51 కిలోల విభాగం సెమీఫైనల్లో 14తో సాక్షి చౌదరి చేతిలో ఓడిపోయింది. ఇటీవల కాలంలో భారత బాక్సింగ్‌లో అతి పెద్ద సంచలనం ఇదే. డబుల్ వరల్డ్ ఛాంపియన్ నిఖత్ కొంతకాలంగా అస్థిర ప్రదర్శన చేస్తోంది. ఆసియా ఛాంపియన్‌షిప్‌స్‌లో ఆమె కాంస్యం మాత్రమే గెలుచుకోగలిగింది. ఆ టోర్నీలో నిఖత్.. ఒలింపిక్ ఛాంపియన్ వు యు (చైనా) చేతిలో ఓడింది. ఇక సాక్షి ఫైనల్లో మీనాక్షి హుడాను ఢీకొంటుంది. సాక్షిది నిజానికి 54 కిలోల విభాగం. బరువు తగ్గి 51 కిలోల విభాగానికి మారింది. నీతు ఘంఘాస్, హితేశ్ గులియా కూడా ట్రయల్స్‌లో పరాజయంపాలయ్యారు. చిత్రహింసకు గురయ్యాం... నిఖత్: గత రెండు వారాల్లో బాక్సర్లు చాలా యాతనకు గురయ్యారని నిఖత్ జరీన్ చెప్పింది. బాక్సింగ్ సమాఖ్య, భారత క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్)ల మధ్య అథ్లెట్లు నలిగిపోయారని పేర్కొంది. అనేక మంది బాక్సర్లు ఫిర్యాదులు చేయడంతో బీఎఫ్ఐ మదింపు ఆధారిత ఎంపిక ప్రక్రియపై సాయ్ అభ్యంతరం వ్యక్తం చేసింది. కామన్వెల్త్, ఆసియా క్రీడల జట్లను ఎంపిక చేసేందుకు నిర్వహిస్తోన్న మదింపు శిబిరాన్ని సస్పెండ్ చేసింది. దీంతో బీఎఫ్ఐకి తిరిగి సంప్రదాయ సెలక్షన్ ట్రయల్స్‌ను నిర్వహించక తప్పలేదు. ''గత రెండు వారాలు చిత్రహింసకు గురయ్యాం. ఏ వ్యక్తినో, వ్యవస్థనో నిందించాలనుకోవట్లేదు. కానీ వాళ్ల (సాయ్, బీఎఫ్ఐ) మధ్య సమస్య వల్ల అథ్లెట్లు నలిగిపోయారు'' అని నిఖత్ చెప్పింది.

ఐపీఎల్ లో ఫస్ట్ టైమ్.. ఒకే టీమ్‌లో ముగ్గురు ఇండియన్ కెప్టెన్స్

ఐపీఎల్ 2026 నేపథ్యంలో ముంబై ఇండియన్స్ అరుదైన ఘనత సొంతం చేసుకుంది. ఒకే సీజన్ లో ముగ్గురు భారత జట్టు ఆటగాళ్లు కెప్టెన్లుగా వ్యవహరించిన తొలి జట్టుగా ముంబై ఇండియన్స్ నిలిచింది. 2008లో ముంబై ఇండియన్స్ కు హర్భజన్ సింగ్, పొలాక్, సచిన్ టెండూల్కర్ ముగ్గురు కూడా కెప్టెన్లుగా వ్యవహరించారు. అలాగే 2013లో పూణే జట్టుకు మాథ్యూస్, టేలర్, ఆరోన్ పించ్ సారథ్యం వహించిన సంగతి తెలిసిందే.

ఇక 2021లో సన్ రైజర్స్ హైదరాబాద్ కు డేవిడ్ వార్నర్, కేన్ విలియమ్సన్, మనీష్ పాండే కెప్టెన్లుగా వ్యవహరించారు. ఇటు 2024 లో పంజాబ్ కింగ్స్ కెప్టెన్లుగా గా శిఖర్ ధావన్, సామ్ కరన్, జితేష్ శర్మ వ్యవహరించారు. అయితే ఈ సీక్వెన్స్ లో ఎవరో ఒకరు విదేశీ ప్లేయర్ ఉన్నారు. కానీ ఈ సీజన్ లో ముంబై ఇండియన్స్ కెప్టెన్ గా ముగ్గురు కూడా భారత జట్టు ఆటగాళ్లు హార్దిక్ పాండ్యా, సూర్య కుమార్ యాదవ్, బుమ్రా కెప్టెన్లుగా వ్యవహరించారు. దీంతో ముంబై ఇండియన్స్ సరికొత్త చరిత్ర సృష్టించింది.

క్వార్టర్స్ లో సింధు, లక్ష్యసేన్

బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 500 టోర్నీలో భారత స్టార్ షట్లర్లు సత్తాచాటుతున్నారు. మహిళల సింగిల్స్‌లో పి.వి. సింధు.. పురుషుల విభాగంలో లక్ష్యసేన్.. డబుల్స్‌లో సాత్విక్ చిరాగ్ క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లారు. గురువారం ప్రిక్వార్టర్స్‌లో సింధు 2113, 2115తో అమలీ షుజ్ (డెన్మార్క్)పై విజయం సాధించింది. కేవలం 28 నిమిషాల్లోనే ఆమె ప్రత్యర్థిని చిత్తుచేసింది. దేవిక సిహాగ్ 2123, 1121తో పిచమోన్ (థాయ్‌లాండ్) చేతిలో పరాజయం చవిచూసింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో లక్ష్యసేన్ 2112, 2113తో షువాన్ చెన్ (చైనా)పై గెలుపొందాడు. కిదాంబి శ్రీకాంత్ 1621, 2111, 1821తో లీ యాంగ్ (చైనీస్ తైపీ) చేతిలో పోరాడి ఓడాడు. డబుల్స్‌లో సాత్విక్ చిరాగ్ జోడీ 2112, 2119తో బ్రయాన్ జెరెమీ మహ్మద్ హైకాల్ (మలేసియా) జంటపై విజయం సాధించింది. క్వార్టర్స్‌లో అకానె యమగూచి (జపాన్)తో సింధు, కున్లావుత్ వితిద్సర్న్ (థాయ్‌లాండ్)తో లక్ష్యసేన్, తకుమి నొమురా యుచి షిమోగమి (జపాన్)తో సాత్విక్ చిరాగ్ తలపడతారు.